
మూడు వనరుల నుంచి నీటి తరలింపు మార్గాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్‌పై దృష్టి సారించింది. పథకాన్ని పునర్ వ్యవస్థీకరిస్తోంది. సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి కేంద్రం నుంచి మరో మూడేళ్లు అనుమతి పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. భూగర్భ జలాలను వినియోగించకుండా ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. ఉన్న జలాశయాల్లో ఏ ప్రాంతానికి ఎక్కడి నుంచి సరఫరా చేసే అవకాశం ఉందన్న విషయం గుర్తించి తదనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించింది. దీంతో వారం రోజులుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రధాన జలాశయాల నుంచి 1,629 ఆవాసాలతో పాటు ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గంలోని 202, బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని 59 హ్యాబిటేషన్లకు నీటి సరఫరాకు రూ.3,750 కోట్లు అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పనులు సాగక రద్దుచేసిన రూ.412 కోట్ల విలువైన 1,102 పనులు తిరిగి చేపట్టేందుకు మరో రూ.650 కోట్లు అవసరమన్న భావనకు వచ్చారు. అలా మొత్తం జలజీవన్ పథకం పునర్‌వ్యవస్థీకరణ కోసం మొత్తం రూ.4,400కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

మూడు జలాశయాలు రూ.4,400 కోట్లు!

జలజీవన్ మిషన్ పనులపై సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

- లైన్ ఎస్టిమేషన్లపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల కసరత్తు
- వనరుల సద్వినియోగంతోపాటు అదనంగా పనులు
- ప్రతి ఇంటికీ కొళాయి.. భూగర్భ జలం వాడకుండా నీరు
- రోజుకు ఒక్కొక్కరికి 55 లీటర్ల సరఫరా
- ఏడాదికి 3.2 టీఎంసీలు అవసరం
- కందుకూరు నియోజకవర్గానికీ వెలిగొండ నుంచే నీరు


రామతీర్థం రిజర్వాయర్ నుంచి కొండపి ప్రాంతానికి నీటిని తరలించే లైన్ ప్రతిపాదిత మ్యాపు

ఒంగోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత తాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్‌లో ఈ అంశం ప్రధానంగా 2022 నుంచి అమలు చేస్తుండగా గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. కేంద్రం ఇచ్చిన గడువు 2025 మార్చితో ముగియనుంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి కేంద్రం నుంచి మరో మూడేళ్ల అనుమతి పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ పథకంలో ప్రధాన లక్ష్యాలను పరిశీలిస్తే ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా ఏడాది పొడవునా నీటి సరఫరా, భూగర్భ జలంతో అవసరం లేకుండా జలాశయాల నుంచి ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్లు అందిస్తారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 4,58,026 కుటుంబాలు ఉండగా 60శాతం ఇళ్లకు మాత్రమే కొళాయిలు ఉన్నాయి. ఈ పథకంలో కొళాయి లేని ఇల్లు లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. జలజీవన్

మిగతా 6వ పేజీలో


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మిశ్రా, వేదికపై కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ తదితరులు

కచ్చితమైన సమాచారం కావాలి

- ఎస్సీ ఉపకులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం
- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఒంగోలునగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లోని ఉపకులాలకు సంబంధించి కచ్చితమైన సమాచారం అందించాలని ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఆయన సోమవారం ఉదయం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై గణాంకాలతో సమగ్రంగా వివరాలను అందజేయాలని కోరారు. రాజకీయంగా కూడా ఎస్సీల స్థితిగతులను కమిషన్ పరిశీలిస్తుందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా స్థాయిలో ఎస్సీల్లోని 59 ఉప కులాల పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులంతా తమ తమ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలు, కేడర్, ఉపకులాల వారీగా కచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పూర్వపు ప్రకాశం జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉండగా ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ బాపట్ల జిల్లాలో 13, నెల్లూరు జిల్లాలో ఐదు మండలాలను కలిపారని తెలిపారు. ప్రస్తుత ప్రకాశంలో 38 మండలాలు ఉన్నాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పూర్వపు జిల్లాలో 33,97,448 మంది జనాభా ఉండగా అందులో ఎస్సీలు 7,87,861 మంది ఉన్నారని వివరించారు. అందులో పురుషులు 3,97,861 మంది, స్త్రీలు 3,90,619 మంది ఉన్నారన్నారు. ఎస్సీ అక్షరాస్యత జనాభా మొత్తం 4,10,946 కాగా అందులో పురుషులు 2,40,551 మంది, స్త్రీలు 1,70,395 మంది ఉన్నారని తెలిపారు. ఎస్సీల అక్షరాస్యత శాతం 59.75 ఉండగా అందులో పురుషుల

మిగతా 6వ పేజీలో

అగ్రవర్ణాల్లోని పేదలకూ సబ్సిడీ రుణాలు

- బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు
- జిల్లాకు 568 యూనిట్లు కేటాయింపు
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు నగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల తరహాలోనే అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను ఇస్తోంది. వారు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలను మంజూరు చేస్తోంది. 50శాతం సబ్సిడీ ప్రకటించింది. జిల్లాకు మొత్తం 568 యూనిట్లను కేటాయించింది. వీటిలో

మిగతా 6వ పేజీలో


ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతున్న పీఆర్ కమిషనర్ కృష్ణతేజ, వేదికపై డ్వామా అధికారులు

ఆరు నెలల్లో గ్రామాల్లో మార్పు రావాలి

- ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్లాలి
- తర్వాత పనితీరు ఆధారంగానే కొనసాగింపు
- పొలాల్లో నీటి కుంటలు, చెరువుల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి
- కూలీలకు కనీస వేతనం రూ.300 రావాల్సిందే!
- 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణలో పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ఆరు నెలల్లో గ్రామాల్లో మార్పులు రావాలని, లేదంటే క్షేత్రస్థాయి సహాయకులను తొలగిస్తామని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న ఓ కన్వెన్షన్ హాలులో సోమవారం క్షేత్రస్థాయి సహాయకులు, సీనియర్ మేట్ల శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కూలీలకు కనీస వేతనం రూ.220 మాత్రమే వస్తుండటంతో ముందుగా ఇక్కడ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధి ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలన్నారు. ఆ ఫలితాలు ఆరు నెలల్లో కనిపించాలన్నారు. ప్రధానంగా ప్రస్తుత సీజన్ ఉపాధి పనులకు అనుకూలమైనదన్నారు. అందువల్ల రైతుల భూముల్లో నీటి కుంటలతోపాటు పంచాయతీలో ఒక చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరుతున్నప్పుడు వారే ముందుకు వచ్చి నీటి కుంటల పనులు చేపడతారని ఆయన తెలిపారు. కూలీల వేతనంలో కూడా జిల్లా వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో కూలీలకు రోజువారీ కేవలం రూ.220లోపు మాత్రమే లభిస్తున్నదన్నారు. తప్పనిసరిగా రోజుకు రూ.300 వేతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ దిశగా ఎఫ్‌ఏలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా చేపట్టాల్సిన పనులపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ముందుకు వెళ్లాలని.. అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేసే అవకాశం ఉంటుందన్నారు. కాగా మధ్యాహ్నం జరిగిన తరగతుల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముగం, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీ హర్ష, వాటర్ షెడ్ జాయింట్ కమిషనర్ సునీత, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో జి.వెంకటనాయుడు, డ్వామా ఏవో ఝాన్సీ, ఏపీడీ బిజే వండర్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న వారిని వారిస్తున్న పోలీసులు

పోటాపోటీగా ప్రదర్శనలు

- నినాదాలతో దద్దరిల్లిన ప్రకాశం భవన్
- ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు వినతుల వెల్లువ

వివరాలు మెయిన్‌లో..

రెవెన్యూ శాఖలో పెచ్చరిల్లిన అవినీతి

- మ్యుటేషన్‌కు లక్షల్లో డిమాండ్
- పునుగోడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌కు ప్రజల ఫిర్యాదు
- తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు?
- చక్రం తిప్పిన మహిళా వీఆర్వోపైనా చర్యలకు డిమాండ్

వివరాలు 7వ పేజీలో

శీనారెడ్డి అక్రమాలపై ఇంటెలిజెన్స్ దృష్టి

- పలువురి నుంచి వివరాల సేకరణ
- ఇప్పటికే కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ
- తాజాగా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేసిన మోహన్

6


పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఈదర మోహన్


రాయవరం చెరువులో ఇటుక బట్టీల తొలగింపును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్ తహసీల్దార్, చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

చెరువులో ఆక్రమణల తొలగింపు

మార్కాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామ చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఇటుకల బట్టీలను అధికారులు సోమవారం తొలగించారు. రాయవరం గ్రామ చెరువు 203 సర్వే నెంబర్‌లో 62 ఎకరాలలో ఉంది. అందులో సుమారు 20 ఎకరాలను గ్రామ వైసీపీ నాయకుడు ఆక్రమించి మూడు ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. యథేచ్ఛగా అక్కడే వ్యాపారాలు చేస్తున్నారు. గ్రామసమీపంలో నివాస ప్రాంతాలలో ఇటుక బట్టీలు నిర్వహించకూడదని తెలిసినా గత ప్రభుత్వంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో వైసీపీ నాయకుడు చెరువును ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సోమవారం పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగించారు.

చారిత్రక ఖిల్లా తంగెళ్ల

- కనుమరుగవుతున్న పురాతన కట్టడాలు
- ఆస్తులున్నా అభివృద్ధికి నోచుకోని శివాలయం
- కూలిపోయే దశకు చేరుకున్న పురాతన పోలీస్ స్టేషన్ భవనం
- పరిరక్షించాలని కోరుతున్న గ్రామస్థులు

7


తంగెళ్లలోని పురాతన శివాలయం


కొండపిలో పింఛన్ లబ్ధిదారుడిని విచారిస్తున్న ఎంపీడీవో రామాంజనేయులు, వైద్యుల బృందం

ప్రారంభమైన పరిశీలన

- మంచానికి, వీల్‌చైర్‌కే పరిమితమైన పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందాలు
- తొలిరోజు 74 మందికి పరీక్షలు

ఒంగోలు నగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమై నెలవారీ రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల అర్హతను పరీక్షించేందుకు సోమవారం నుంచి వెరిఫికేషన్ ప్రారంభమైంది. ముగ్గురు వైద్యులు, ఒక డిజిటల్ అసిస్టెంట్‌తో కూడిన ఐదు బృందాలు ఐదు మండలాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించాయి. ఆరోగ్య పింఛన్ పొందుతున్న లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించాయి. తొలిరోజు అర్ధవీడులో 17, దోర్నాలలో 12, కొండపిలో 74, ఒంగోలు రూరల్‌లో ఆరుగురు

మిగతా 6వ పేజీలో

అగ్రవర్ణాల్లోని పేదలకూ సబ్సిడీ రుణాలు

(5వ పేజీ తరువాయి)

స్వయం ఉపాధి యూనిట్లు 483, జనరిక్ మందుల దుకాణాలు 85 ఉన్నాయి. జనరిక్ మందుల దుకాణాలకు యూనిట్ విలువ రూ. 8 లక్షలు కాగా ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీ ఉంటుం ది. మిగిలిన సొమ్మును లబ్ధిదారుడు బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కులాల వారీగా ఎవరికి ఎన్ని అన్నది కూడా నిర్ణయించింది.

16వరకూ దరఖాస్తుల స్వీకరణ

ఈబీసీలకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 8నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 16వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందన్నారు. అనంతరం వచ్చిన వాటిని పరిశీలించి, ఇతర అభ్యంతరాలను పూర్తిచేసి ఫిబ్రవరిలో గౌండింగ్ ప్రక్రియను చేపడతామని ఆయన తెలిపారు.

ప్రారంభమైన పరిశీలన

(5వ పేజీ తరువాయి)

రాచర్లలో 22 మందిని తనిఖీ చేయాల్సి ఉంది. అయితే 74 మందికే పరీక్షలు పూర్తి చేయగలిగారు. సోమవారం ఉదయం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో గుంటూరు నుంచి వచ్చిన వైద్యనిపుణులతో వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ సమావేశమయ్యారు. ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారిని పరీక్షించే విషయంలో తగిన సూచనలు, సలహాలు అందజేశారు. అర్హులకు ఎలాంటి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా అనర్హులను గుర్తించాలన్నారు.

కచ్చితమైన సమాచారం కావాలి

(5వ పేజీ తరువాయి)

శాతం 69.50 కాగా స్త్రీల శాతం 49.86గా ఉందన్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల్లో కలిపి ఉద్యోగులు 36,669 మంది ఉన్నారని, అందులో మాలలు 21,789 మంది, మాదిగలు 14,770 మంది, ఇతర ఉపకులాలు వారు 160మంది ఉన్నారని వివరించారు. రాజకీయంగా మునిసిపాలిటీల్లో మాల కులంలో 23మంది, మాదిగలలో 13మంది వివిధ హోదాల్లో ఉన్నారని తెలిపారు. పంచాయతీల్లో మాలలు 1,386 మంది, మాదిగలు 1,867మంది ఇతర ఉప కులాల్లో ఐదుగురు వివిధ పదవుల్లో కొనసాగుతున్నారని ఆమె కమిషన్ చైర్మన్‌కు వివరించారు.

ధేనువకొండలో చోరీపై కేసు నమోదు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధేనువకొండలో చోరీ జరిగిన ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. దేనువకొండ కు చెందిన బోడపాటి అంజయ్య ఈ నెల 2వ తేదీ రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.35వేలు, 11 గ్రాముల బంగారం అపహరించుకు పోయారు. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

శీనారెడ్డి అక్రమాలపై ఇంటెలిజెన్స్ దృష్టి

పలువురి నుంచి వివరాలు సేకరణ

ఇప్పటికే కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ

తాజాగా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కీలకమైన మరో విభాగం దృష్టి సారించింది. ఇప్పటికే ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై తొలుత విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టగా తర్వాత కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు అధికారుల కమిటీ విచారణ నిర్వహిస్తోంది. దాదాపు పక్షం రోజులుగా ఇది కొనసాగుతుండగా అనేక అక్రమాలు, అవినీతి వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఇందుకు సంబంధించి వరుస కథనాలు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వంలో కీలకంగా పనిచేసే ఇంటెలిజెన్స్ (గూఢచార) విభాగం అధికారులు దృష్టి సారించారు. విభిన్న అంశాలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తగు సమాచారం ఇచ్చే కీలకమైనది ఐబీ విభాగం కాగా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు శీనారెడ్డి వ్యవహారంపై దృష్టిసారించారు. రెండు, మూడు రోజులుగా శీనారెడ్డి పీడీగా పనిచేసిన కాలంలో ఏం జరిగింది, ఏఏ అంశాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయి, ప్రస్తుతం అధికారుల విచారణ ఎలా జరుగుతుందని ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం కొందరు కీలక వ్యక్తులను కలిసి వివరాలు సేకరించారు. అలాగే ఇప్పటికే అధికారవర్గాల నుంచి కూడా వారు కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది.

పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

శీనారెడ్డి అక్రమాలపై విచారణ కోరుతూ పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ ప్రభుత్వ పెద్దల నుంచి అధికారుల వరకు పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తాజాగా డ్వామాను పర్యవేక్షించే రాష్ట్రస్థాయి అత్యున్నత అధికారైన గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను కూడా కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు. ఒంగోలులో సోమవారం జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణకు కమిషనర్ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయనన్ను మోహన్ కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో తాను చేసిన ఫిర్యాదు కాపీలు, మీడియాలో వచ్చిన కథనాలు ప్రస్తుతం జరుగుతున్న అధికారుల విచారణలో వెలుగుచూస్తున్న అంశాలను వివరించారు. మరింత లోతుగా విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ అన్ని అంశాలను విని నిర్దిష్ట చర్యలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలాఉండగా లోకేశ్వరరావు కమిటీ తమ విచారణలో భాగంగా ఈనెల 8,9 తేదీల్లో శీనారెడ్డిపై ఫిర్యాదులు చేసిన, అలాగే ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన డ్వామా ఉద్యోగులను విచారించనుంది. ఈనెల 8న ఐదుగురు ఫిర్యాదుదారులను, 9వతేదీన 31 మంది డ్వామా ఉద్యోగులను విచారణ చేయనుంది. ఆ మేరకు హాజరుకావాలని వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీచేశారు.

ఖోఖో పోటీలలో భారత్ సత్తా చాటాలి

అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య

ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగో ఆవిష్కరణ


ఖోఖో పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ గరటయ్య, సీతారామిరెడ్డి

పంగులూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలలో భారత్‌జట్టు సత్తా చాటి విజేతగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బీసీహెచ్ గరటయ్య ఆకాంక్షించారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ అకాడమీలో ఢిల్లీ కేంద్రంగా నిర్వహించబోతున్న ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగోను సోమవారం డాక్టర్ గరటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంగులూరులో ఖోఖో క్రీడకు ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. మూడున్నర దశాబ్దాలుగా పంగులూరు కేంద్రంగా ఖోఖో క్రీడకు లభించిన ఆదరణ, స్థానికంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. ఖోఖో అన్ని క్రీడలకూ తల్లి వంటిదన్నారు. ఖోఖో క్రీడాకారులను తీర్చి దిద్దడంలో పంగులూరు ఓ ఖార్ఖానాగా పేరు గడించిదని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వందలాది మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించగా, పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని పతకాలను సాధించారని గుర్తుచేశారు. క్రీడల్లో రాణించిన ఎందరికో ఉపాధి చూపిన ఖోఖో కనిగిరి, ఈదర ప్రాంతాలలో విస్తరించేందుకు దోహద పడిందన్నారు. ఈ సందర్భంగా ఖోఖో లోగోతో పలువురు క్రీడాకారులు, పాఠశాల విద్యార్థులు గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, కోచ్ డీఎల్ రెడ్డి, రోటరీ ప్రతినిధులు రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, చిలుకూరి వీరరాఘవయ్య, హెచ్ఎం రమాదేవి, నేతలు జాగర్లమూడి సుబ్బారావు, రావూరి శ్రీనివాసరావు, ఐ.సుబ్బారావు పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయాలు కనుమరుగు

గ్రామాలలో పెరిగిన క్రికెట్, షటిల్ పోటీలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే గ్రామాలలో పండుగదనం ఉట్టిపడేలా సందడిగా ఉండేది. అయితే క్రమేపీ నాటి సంక్రాంతి సంబరాలు కనుమరుగు అవుతూ వస్తున్నాయి. గంగిరెద్దుల ఆటలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. గాలిపటాల రెపరెపలు మచ్చుకు కూడా లేవు. ఇక పశుసంపదకు పూజలు అసలే లేవు. బతుకుదెరువు కోసం కొందరు గంగిరెద్దుల వలే ఆవులను సింగారించి వీధుల్లో తిప్పుతూ పొట్ట పోసుకుంటున్నారు. ఇక ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు అక్కడక్కడా తళుక్కున మెరుస్తున్నాయి. పేడతో పెట్టే గొబ్బిమ్మల జాడే లేదు. అంతేగాక హరిదాసుల కీర్తనలతో గ్రామాలు ప్రతిధ్వనించేవి. నేడు వారు రాక కూడా తగ్గింది.

నాటి సంక్రాంతి సంబరాల స్థానంలో ప్రస్తుతం గ్రామాలలో సైతం క్రికెట్, షటిల్ పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామాలలో సైతం యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఇతర ప్రాంతాలలో స్థిరపడగా సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. అదే సమయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాల పేరుతో కలిసి చదువుకున్న వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

అద్దంకి నియోజకవర్గంలో సంక్రాంతి మరింత సందడిగా ఉంటుంది. కొరిశపాడు మండలంలోని రావినూతలలో మూడు దశాబ్దాలుగా అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి క్రికెట్ టీమ్‌లు పాల్గొంటాయి. ఇదే బాటలో పంగులూరు మండలం కొండమంజులూరులో కూడా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను దశాబ్దకాలంగా నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి, రెండు, మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లను బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాలలో కూడా ఏటా నిర్వహిస్తున్నారు. ఇలా సంక్రాంతి సంప్రదాయం కాస్తా క్రికెట్ టోర్నమెంట్ వైపు మళ్లింది.


గంగిరెద్దుల వారి విన్యాసాలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వస్తుండడంతో సందడిగా మారుతున్నాయి. ఈ క్రమంలో నాడు చిన్నతనంలో కలిసి చదువుకున్న మిత్రులందరూ కలిసేందుకు ఉత్సాహం చూపుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో తమకు విద్యా బుద్ధులు నేర్పించన గురువులను సన్మానిస్తున్నారు. అలాగే పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. సంప్రదాయంగా చేసే సంక్రాంతి పండుగ క్రమక్రమంగా రూపం మార్చుకుని ఆధునికత వైపు నడుస్తోంది. అయినప్పటికీ ఇంకా కొన్నికొన్ని ఊళ్లలో అచ్చమైన సంక్రాంతి పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తుండడం గమనార్హం.


గ్రామాల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

మూడు జలాశయాలు.. రూ.4,400 కోట్లు!

(5వ పేజీ తరువాయి)

పునర్వ్యవస్థీకరణలో వెలిగొండ అత్యంత కీలకం కానుంది. ఈ ప్రాజెక్టు ఆధారంగానే జిల్లాలోని కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాలతోపాటు దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాల్లోని 1,179, ప్రస్తుతం నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలోని 202 ఆవాసాలకు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకోసం రూ.2,500 కోట్లు అవసరమని అంచనా. ఇందులో గత వైసీపీ ప్రభుత్వం నాలుగు నియోజకవర్గాలకు రూ.1,290 కోట్లతో టెండర్లు పిలిచి పనులు చేయక రద్దయిన వాటిని కూడా కలిపి చేస్తారు. వెలిగొండ రిజర్వాయర్‌లో గతంలో రూ.73కోట్లతో తాగునీటి కోసం చేపట్టిన ఇన్‌టెక్ వెల్ నిర్మాణం, ఫిల్టర్‌బెడ్‌లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఆ ఇన్‌టెక్ వెల్ నుంచి రిజర్వాయర్‌లో నీటిని ఫిల్టర్ బెడ్‌లోకి తీసుకొని అక్కడి నుంచి మూడు విడివిడి పైపులైన్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని తరలిస్తారు.

రామతీర్థం, గుండ్లకమ్మల నుంచి

రామతీర్థం రిజర్వాయర్ నుంచి కొండపి నియోజకవర్గంలోని మండలాలతోపాటు ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని చీమకుర్తి, ఎస్ఎన్‌పాడు మండలాల్లో ఉన్న 315 హ్యాబిటేషన్లకు రూ.800 కోట్లతో, గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోని మద్దిపాడు, ఎన్‌జీపాడు, ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలంలోని 135 హ్యాబిటేషన్లకు బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు, అద్దంకి మండలాల్లోని మరో 50 కలిపి 194 హ్యాబిటేషన్లకు రూ.405 కోట్లతో పథకాన్ని ప్రతిపాదిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరై పనులు చేపట్టని, అలాగే కొద్దిపాటి పనులు మాత్రమే జరిగిన రూ.412 కోట్ల విలువైన 1,102 పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దుచేసింది. ఆ గ్రామాలలో తిరిగి ఆ పనులను తాజా లెక్కల ప్రకారం చేపట్టనుంది. అందుకుగాను రూ.650 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. అలా మొత్తంగా రూ.4,400కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఆ మేరకు గుర్తించిన పనులు ఎలా చేయాలి? ఏ గ్రామానికి ఎక్కడి నుంచి ఏమార్గంలో పైపులైన్లు వేయాలి? అన్న దానిపై ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లైన్ ఎస్టిమేషన్లు తయారు చేస్తున్నారు. అందులో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లు, పైపులైన్లు ఇతరత్రా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అదనంగా చేయాల్సిన పనులను ప్రతిపాదిస్తున్నారు.

మార్చి ఆఖరుకు పూర్తిస్థాయి నివేదిక

ఈ నెలాఖరులోపు అంచనాలు, మార్చి ఆఖరులోపు ప్రాజెక్టు పూర్తిస్థాయి రిపోర్టులు రూపొందించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. కాగా ఈ తరహాలో జిల్లా మొత్తానికి కూడా ఏడాది పొడవునా నీటి సరఫరాకు కేవలం 3.20టీఎంసీలు సరిపోతాయని అంచనా వేస్తున్నారు. అందులో వెలిగొండ నుంచి 2టీఎంసీలు, రామతీర్థం నుంచి 0.75 టీఎంసీలు, గుండ్లకమ్మ నుంచి 0.50టీఎంసీలు అవసరంగా గుర్తించారు. ఆమేరకు నీటి లభ్యతకు ఏమాత్రం ఢోకా ఉండదని భావిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ పథకాలు పూర్తయ్యాక భూగర్భ జలాల వాడకం పూర్తిగా నిలిపేసే అవకాశాలు ఉన్నట్లు అధికారవర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

కారంచేడు ఎయిడెడ్ పాఠశాల ప్రభుత్వానికి అప్పగింత

కారంచేడు(పర్చూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయడమ్మ ఎయిడెడ్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ మేరకు సోమవారం కమిటీ ప్రతినిధులు బాపట్ల జిల్లా డిప్యూటీ ఈవో ఎ.శ్రీనివాసరావుకు పాఠశాలను అప్పగిస్తూ పత్రాలను సమర్పించారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ లగడపాటి రాజ్యలక్ష్మి, మధుసూదనరావు అభీష్టం మేరకు యార్లగడ్డ రఘుబాబు చేతుల మీదుగా పాఠశాలకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సం నుంచి ఈపాఠశాల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారు ఎంపీవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక దందా, అనధికారిక లేఅవుట్లను ఉపేక్షిస్తే చర్యలు

అవీఇవీ

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, అనధికారిక లేఅవుట్లపై ఉపేక్షిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు వీఆర్వో లు, విలేజ్ సర్వేయర్లకు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరం ప్రాంగణంలో సోమవారం వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లు, ఇసుక దందాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లదేనన్నారు. విధులకు ఎవరైనా ఆటం కం కలిగిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ఈ దందాలను అరికట్టకుండా, ఉన్నతాధికారులకు తెలపకుండా వ్యవహరిస్తే అది ఉద్దేశపూర్వక తప్పుగా భావించి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రభుత్వ భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వ ఆస్తి ఎక్కడా పరాధీనం కా కూడదని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్ పాల్గొన్నారు.

జీసీటీఏ జిల్లా కార్యదర్శిగా ప్రసాద్


ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) బాపట్ల జిల్లా యూనిట్‌కు జరిగిన ఎన్నికలలో కార్యదర్శిగా కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ వీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన అధ్యాపకులు, సిబ్బంది జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాద్‌ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

మృతుడి అనకాపల్లి వాసి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో అనకాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈఘటన సీఈసీ కళాశాల సమీపంలోని రామాపురం రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం ఆర్ భీమవరానికి చెందిన కోడూరు వెంకటరావు (35) రామాపురానికి చెందిన జయరాణిను సుమారు పదేళ్ల క్రితం వివాహ మాడాడు. ప్రస్తుతం వీరికి ఎనిమిదేళ్ల పాప ఉంది. వెంకటరావు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో నెలకొన్న వివాదాలు కారణంగా మనస్థాపం చెందిన అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

తెగుళ్లతో మిర్చి రైతుల బెంబేలు


మందును పిచికారీ చేస్తున్న రైతు

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులను పలు రకాల తెగుళ్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పైర్లు పచ్చగా ఉండి పూత పిందె దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్లు సోకి పాడు చేస్తున్నాయి. తెగుళ్ల నుంచి పైర్లను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. బొబ్బర, నల్లి తెగుళ్ల బాధ వెంటాడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కౌలు, వ్యవసాయ పెట్టుబడులు కలుపుకొని రూ. లక్ష వరకు ఖర్చు అయిందని, పైర్లను చూస్తుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనపడడం లేదని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో దాదాపు 15 వేల ఎకరాలకు పైగానే రైతులు మిర్చి పైరును సాగు చేస్తున్నారు. గత ఏడాది మిర్చి ధర దిగజారడం, పెట్టుబడులు అధికంగా ఉండడంతో ఈ ఏడాది సాగును తగ్గించారు. అయితే ఈ ఏడాది అయినా ధర ఆశాజనకంగా ఉంటుందన్న ఆశతో వ్యవప్రయాశలు పడి సాగు చేసిన రైతులకు తెగుళ్లు దాడి చేస్తున్నాయి. తెగుళ్ల తీవ్రతతో ఇప్పటికే వందల ఎకరాల్లో పైర్లు తొలగించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే గులాబీ తెగులుతో తెల్లబంగారం (పత్తి) నష్టపోయినట్లుగానే మిర్చి రైతులూ నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

నీరు అందుబాటులో ఉందని సాగు చేశాం

గత ఏడాది ఆరుతడులకు నీరు లేకపోవడంతో సాగు చేసుకున్న పైర్లను కాపాడుకునేందుకు తీవ్రంగా ఇబ్బం ది పడ్డాం. ఈ ఏడాది నీరు అందుబాటులో ఉండడంతో వ్యయ ప్రయాసలు పడి ఉన్న కొద్ది భూమితోపాటు, మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చిని సాగుచేశాను. పైర్లు ఆశాజనకంగా ఉన్న తరుణంలో తెగులు సోకింది. **- గన్నవరపు సాంబయ్య, నూతలపాడు**

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

వేలకు వేలు పెట్టుబడులు పెట్టి మిర్చిని సాగు చేస్తున్నాను. తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం నల్లి తెగులు ఉధృతంగా ఉంది. పైర్లు నిలువునా దెబ్బతింటున్నాయి. ఎన్ని క్రిమిసంహారక మందులు చల్లినా ఫలితం కన్పించడం లేదు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. **- జీ.రమణమ్మ మహిళా రైతు, నూతలపాడు**



సోలార్‌తో పందులు పరార్!

- పైర్లను కాపాడుకునేందుకు ఓ రైతు వినూత్న ప్రయోగం
- ఫలితం సాధించడంతో అనుసరిస్తున్న చుట్టుపక్కల కర్షకులు


పొలం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్


చేను చుట్టూ రైతు అమర్చిన తీగ

పీసీపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఒక రైతు వినూత్న ఆలోచన చేశాడు. తొలత పొలం చుట్టూ కాపలా ఉండడంతోపాటు బాణసంచా పేల్చినా ఫలితం దక్కేది కాదు. పందులు వెళ్లిపోకుండా పైరులోనే నక్కి ఉండేవి. దీంతో అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవాలో యూట్యూబ్‌లో వెతికాడు. తెలంగాణ ప్రాంతంలోని ఓ రైతు పొలం గట్టు మీద సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసి దానికి బ్యాటరీని అమర్చాడు. బ్యాటరీ నుంచి ఓ తీగను తీసుకుని పొలం చుట్టూ కర్రలు పాతి వాటికి చుట్టి ఉంచిన తీగకు కనెక్షన్ ఇచ్చాడు. బ్యాటరీ వద్ద స్విచ్‌ను అమర్చి ఆన్ చేయగానే ఈ ప్యానెల్ నుంచి బ్యాటరీ ద్వారా లోఓల్టేజీ విద్యుత్ పొలం చుట్టూ ఉన్న తీగకు సరఫరా అవుతుంది. అడవిపందులు పొలం వద్దకు రాగానే తీగ తగిలి షాక్‌కు గురై పరుగులు తీస్తున్నాయి. అయితే వాటికి ఎటువంటి ప్రాణాపాయం ఉండదు. పడమటిపల్లి గ్రామానికి చెందిన రామయ్య అనే రైతు రూ.10వేలు ఖర్చు చేసి తన మిరపచేను వద్ద ఈ సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసి మంచి ఫలితం సాధించాడు. దీన్ని చూసి మండలంలోని ఇతర గ్రామాల రైతులు కూడా పొలాల వద్ద సోలార్‌లను ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకుంటున్నారు.


కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరాటేతో ఆత్మరక్షణ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరాటే నేర్చుకోవడం ద్వారా బాల బాలికల్లో ఆత్మరక్షణ సైర్యం పెంపొందుతోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే పాఠశాల విద్యార్థులకు సోమవారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి మౌలాలి మాట్లాడారు. విద్యార్థులలో చదువుతో పాటు ఆటలు, వివిధ ఆరోగ్యాన్ని పెంచే క్రీడలలో శిక్షణ తీసుకోవాలన్నారు. ఆటలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య, ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ పాల్గొన్నారు.



త్రిపురాంతకం నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంతాలకు వాహనాల్లో పరిమితికి మించి వెళుతున్న కూలీలు

ప్రాణాలు పోతున్నా.. ప్రయాణం మారలేదు!

వీరంతా కూలీలు. బతుకుదెరువు కోసం దూర ప్రాంతాలకు పనికెళుతుంటారు. ప్రస్తుతం మిరపకాయలు కోత సీజను కావడంతో కూలీలంతా ఆటోలు, ట్రాక్టర్లు, మినీ లారీల్లో దూరప్రాంత పొలాలకు వెళుతున్నారు. ట్రాలీ ఆటోల్లో, ట్రాక్టర్లలో వందకు మందికిపైగా, ఆటోల్లో 60, 70 మందికిపైగా ఎక్కుతున్నారు. రెండేళ్ల క్రితం కూలీలను తరలించే ఆటోలకు రెండు ప్రమాదాలు జరిగి అనేకమంది గాయపడ్డారు. గతేడాది జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అయినా వాహనాదారులు నిబంధనలు పాటించడం లేదు.

- త్రిపురాంతకం (ఆంధ్రజ్యోతి)


మిరప కోతకు వెళ్లి ట్రాలీ ఆటో మితిమీరిన లోడ్‌తో త్రిపురాంతకం వస్తున్న కూలీలు


ప్రమాదంలో బోల్తా కొట్టిన ఆటో


గాయపడిన అంజమ్మకు కట్టు కడుతున్న వైద్య సిబ్బంది


ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నాగమణి

అదుపుతప్పి ఆటో బోల్తా

- 8 మంది కూలీలకు గాయాలు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కూలి పనుల కోసం వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడి ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం పుల్లలచెరువు రోడ్డులోని పెట్రోల్ ఫిలింగ్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎర్రగొండపాలేనికి చెందిన కూలీలు పుల్లలచెరువు మండలం చెన్నంపల్లిలోని పొలాల్లో పొగాకు నారు కట్టేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో స్థానిక పెట్రోల్ ఫిలింగ్ స్టేషన్ వద్ద రోడ్డు అంచులు సరిగా లేకపోవడంతో అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూలీలు కోటేశ్వరి, అంజమ్మ, శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ, నాగమణి, మల్లేశ్వరి పాటు మరో మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇంకో మహిళ పార్వతమ్మకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. తీవ్రంగా గాయపడిన పార్వతమ్మను నరసరావుపేటకు రిఫర్ చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 14 మంది ఉన్నట్లు సమాచారం.

మర్రిపూడి మండలంలోని తంగెళ్ల గ్రామానికి చారిత్రక నేపథ్యముంది. వెలమరాజులు ఏలిన ఈ గడ్డపై చారిత్రక ఆనవాళ్లు కనుమరుగైపోతున్నాయి. అప్పట్లో నిర్మించిన దేవాలయాలు, భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నాటి శిలాశాసనాలను పరిరక్షించేవారు లేకపోవడంతో ఇప్పటికే కొన్ని భూస్థాపితమయ్యాయి. ఉన్న ఒకటి, రెండు శిలాశాసనాలు సైతం ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. పురాతన కట్టడాలు కనుమరుగవుతున్నప్పటికీ పురావస్తుశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

- మర్రిపూడి, (ఆంధ్రజ్యోతి)

చారిత్రక ఖిల్లా తంగెళ్ల

- కనుమరుగవుతున్న పురాతన కట్టడాలు
- ఆస్తులున్నా అభివృద్ధికి నోచుకోని శివాలయం
- కూలిపోయే దశకు చేరుకున్న ఆనాటి పోలీస్‌స్టేషన్ భవనం
- పరిరక్షించాలని కోరుతున్న గ్రామస్థులు


పరదా కప్పి ఉన్న శివాలయం

ఎన్నో పంచాయితీలకు వేదికగా మర్రిచెట్టు రచ్చబండ

గ్రామంలో జరిగే ఎన్నో పంచాయితీలకు పురాతన మర్రిచెట్టు సజీవసాక్షంగా నిలిచింది. వందల ఏళ్లనాటి మర్రిచెట్టు చుట్టూ ఉన్న రచ్చబండ గ్రామస్థులకు ఆటవిడిపుగా దోహద పడింది. మరెన్నో వివాదాల పరిష్కారానికి వేదికగా నిలిచింది. చిన్నపిల్లలు ఆడుకునేందుకు మర్రిచెట్ల వేర్లు ఉయల్లా ఉపయోగపడ్డాయి. ఎంతోమంది పాదచారులకు ఆశ్రయం ఇచ్చిన మర్రిచెట్టును పరిరక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


శిలాశాసనం

తంగెళ్ల నేపథ్యమిదీ..

తంగెళ్ల గ్రామాన్ని శాలివాహనుల కాలంలో చిటచ్చివరిగా వెలమరాజు అయిన భలేరావు పరిపాలించారు. కోటలోనే ప్రత్యేకంగా పూజలు చేసుకునేందుకు శివాలయాన్ని నిర్మించారు. కోట బయట విష్ణుమూర్తి దేవాలయం ఉంది. ఒకరోజు చుండి రాజులైన పెదముత్తయ్య, నముత్తయ్యలలో ఒకరు ఆ దారి నుంచి వెళుతున్న సమయంలో వెలమరాజు పెదముత్తడ, చినముత్తాడ అని వ్యంగ్యంగా పిలవడంతో ఆగ్రహించిన చుండి రాజులు ఆ తరువాత ఒకరోజు రాత్రి కోటలోకి ప్రవేశించి వెలమరాజును గొంతుకోసి చంపినట్లు ప్రచారం ఉంది. వెలమరాజు మృతిని తట్టుకోలేక ఆయన సతీమణి రాణి సమీపంలో ఉన్న కోనేరులో పడి ఆత్మహత్య చేసుకుందని ప్రతీతి. అంతటితో వెలమ రాజుల చరిత్ర సమాప్తం అయ్యింది. వెలమ రాజుల పాలనకు గుర్తుగా కోట, శివాలయాలు ఉన్నాయి. దశాబ్ద కాలం క్రితం కోట ఆనవాళ్లు తొలగిపోయి పాఠశాలకు ఆటస్థలంగా మార్చారు. మరికొంత భాగాన్ని పాఠశాల నిర్మాణానికి ఉపయోగించారు. కోనేరు పూడ్చి సచివాలయ నిర్మాణం చేశారు. బయట ఉన్న విష్ణుమూర్తి దేవాలయాన్ని గ్రామస్థులు అధునాతనంగా నిర్మించారు. శివాలయం మాత్రం నేటికి శిథిలావస్థకు చేరువలో ఉంది. పైకప్పు దెబ్బతింటోంది. ఇటీవల గ్రామస్థులు గుడి పైభాగం అంతా టార్పాలిన్ పట్ట కప్పి గంగమ్మ బారి నుంచి ఆ శివయ్యకు రక్షణ ఏర్పాట్లు చేశారు. విలువైన భూములు ఉన్నప్పటికీ ఆ దేవాలయం అభివృద్ధికి దేవదాయశాఖ అధికారులు వీసమెత్తు కూడా పనిచేయడం లేదు. ఏటా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయానికి జమాఖర్చులు చెప్పడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


పెంకులు ఊడిపోయి అధ్వానంగా ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం

శిథిలావస్థలో పోలీస్‌స్టేషన్ భవనం

గ్రామం నడిబొడ్డులో నిర్మించిన పోలీస్ ఠాణ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెంకులు విరిగి పోయాయి. విలువైన కలప తడిచి పాడవుతోంది. గతంలో బ్రిటీష్ ప్రభుత్వ హయాం లో ఇక్కడ పోలీస్‌స్టేషన్ నిర్వహించారని గ్రామ స్థులు చెబుతుంటారు. నడికూడలిలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ఆనాటి పురాతన కట్టడం తమ కంటిముందే శిథిలావస్థకు చేరడం చూడలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంధీలను ఉంచేందుకు ఏర్పాటు చేసిన కారాగారం గేట్లు తుప్పుపట్టి పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తంగెళ్లలో ఉన్న పురాతన కట్టడాల పరిరక్షణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ శాఖలో పెచ్చరిల్లిన అవినీతి

- మ్యుటేషన్‌కు రూ.లక్షల్లో డిమాండ్
- పునుగోడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌కు ప్రజల ఫిర్యాదు
- తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

కనిగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో అవినీతికి రెక్కలు వచ్చాయి. మ్యుటేషన్ చేసేందుకు లక్షల్లో లంచం డిమాండ్ చేస్తున్నారు. చెప్పినంత ముట్టచెబితే ఆమోద ముద్ర పడుతుంది. ఈనెల 4న కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో సాక్షాత్తూ కలెక్టర్ సమక్షంలో ఈ విషయం బట్టబయలైంది. తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడినట్టు తెలిసింది. లంచం విషయంలో ప్రధానంగా అప్పట్లో పునుగోడు వీఆర్వోగా పనిచేస్తున్న మహిళా వీఆర్వో కీలకంగా వ్యవహరించిదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ మహిళా వీఆర్వో అవినీతి దాహానికి అంతేలేకుండా పోయింది. వైసీపీ నేతలను అడ్డం పెట్టుకుని అడ్డూఅదుపు లేకుండా పేదలు, రైతుల నుంచి రూ.లక్షలు గుంజినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పునుగోడు భూ బదలాయింపులో..

కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామంలో వరికూటి మాలకొండయ్య అనే వ్యక్తికి ఉన్న 30 ఎకరాలను వారి వారసులైన కుమారులు భూ పంపకాలు చేసుకున్నారు. ఆ పంపకాల ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు కోసం రూ.2.5లక్షలు మహిళా వీఆర్వో, తహసీల్దార్ కారు డ్రైవర్ డిమాండ్ చేశారు. గత ఏడాది చివరి వరకు పునుగోడు వీఆర్వోగా పనిచేసిన మహిళా వీఆర్వో ప్రస్తుతం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కనిగిరి తహసీల్దార్ అశోక్‌రెడ్డి చేత ఆమోద ముద్ర వేయించేందుకు లంచం వ్యవహారం నడిపినట్లు తెలుస్తుంది. తహసీల్దార్‌కు రూ.రెండున్నర లక్షలు ఇవ్వాలంటూ బేరం పెట్టినట్లు భూయజమాని కుమారుల్లో ఒకరు తహసీల్దార్ కారుడ్రైవర్‌తో నడిపిన సంభాషణ రికార్డు చేశారు. ఈ రికార్డును రెవెన్యూ సదస్సులో కలెక్టర్, ఎమ్మెల్యే సమక్షంలో వినిపించారు. దీంతో తహసీల్దార్ లంచాలు బాగోతం బయట పడింది. కీలకంగా వ్యవహరించిన మహిళా వీఆర్వో, తహసీల్దార్ అవినీతి భాగోతాలు ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నాయి.

తహసీల్దార్ సస్పెన్షన్

పునుగోడులోని భూమి మ్యుటేషన్ విషయంలో వీఆర్వో, కారు డ్రైవర్ ద్వారా లంచం డిమాండ్ చేసినట్లుగా విషయం బయటపడటంతో తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడనున్నట్లు రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. మహిళా వీఆర్వోపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ


ఉచిత మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న సుబ్బారావు, రవీంద్ర

విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ

ఒంగోలువిద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలాజీ నగర్‌లోని మునిసిపల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత మెటీరియల్‌ను సోమవారం లయన్స్ క్లబ్‌ఆఫ్ ఒంగోలు నాయకులు సుబ్బారావు, కేకే కంప్యూటర్స్ అధినేత వలేటి రవీంద్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మెటీరియల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉచితంగా మెటీరియల్ అందజేయడం పట్ల హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈపూరు శివప్రసాద్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.


సమీక్షిస్తున్న చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

పట్టణ వ్యవహారాల కమిటీపై సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లోని కమిటీహాలులో సోమవారం గృహ, పట్టణ వ్యవహార కమిటీతో చైర్మన్ అయిన ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి సమావేశమయ్యారు. పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ, కేంద్ర పర్యాటకమంత్రిత్వ శాఖ, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, హౌసింగ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయా అంశాలపై కమిటీ చైర్మన్ మాగుంట పలు సూచనలు చేశారు.


పీడీసీసీ బ్యాంక్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న జీఎం రాఘవయ్య

డైరీ ఆవిష్కరణ

ఒంగోలు(విద్య)జనవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో సోమవారం సాయంత్రం ఎస్సీఎస్టీ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఉద్యోగుల నూతన సంవత్సర డైరీలను, మహిళల హ్యాండ్ బ్యాగ్‌లను బ్యాంక్ జనరల్ మేనేజర్ కె. రాఘవయ్య ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ సీఈవో బింధు ప్రత్యూష, ఏజీఎం లావణ్యకుమార్, ఎస్‌కె జమీల్ బాషా, శైలజా, ఝాన్సీరాణి, శివారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు ఉద్యోగులు పాల్గొన్నారు

నెలాఖరులో మెగా గ్రౌండింగ్ మేళా

బ్యాంకులు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి

వెలుగు పీడీ రవికుమార్


బ్యాంకు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు పీడీ రవికుమార్

ఒంగోలు నగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులో లబ్ధిదారులకు మెగా గ్రౌండింగ్ మేళాను నిర్వహించబోతున్నట్లు వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగుశిక్షణ కేంద్రంలో ఆయనబ్యాంకు అధికారులతో మెగా గ్రౌండింగ్ మేళా గురించి సమావేశం అయ్యారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ ,లక్‌పతిదీదీ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకులు త్వరితగతిన రుణాలను మంజూరు చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ బ్యాంకు అధికారులను కోరారు. మెగా గ్రౌండింగ్ మేళాలో ఎక్కువ మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని పీడీ కోరారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద ఇప్పటికే 250 దరఖాస్తులు బ్యాంకుల వద్దకు చేరాయన్నారు. వాటిలో కేవలం 50 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నారు. మిగిలిన దరఖాస్తులకు కూడా వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద అన్ని బ్యాంకుల వద్ద 3 వేలదరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పీడీ రవి బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. వీటిని వెంటనే పరిశీలన చేసి రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 55 దరఖాస్తులు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్న 40 దరఖాస్తులనువెంటనే బ్యాంకులకు పంపించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్టు మేనేజర్ రమేష్‌బాబు, కేవీఐబీ డిప్యూటీ డైరెక్టర్ సత్యసాయిమణి, ఏపీవో థామ్సన్, వెలుగు డీపీఎంలు డేవిడ్‌పాండే, సునీత, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.


హరిదాసు, కాటికాపరి వేషధారణతో మాల మహానాడు ప్రదర్శన


డప్పులు కొడుతూ ప్రదర్శనగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు 355 వినతులు

ఒంగోలునగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రజల అభిప్రాయ సేకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు జిల్లాలో వివిధ కుల సంఘాలు, దళిత సంఘాలు,ఎస్సీఉద్యోగసంఘాల, ఎస్సీ వర్గానికి చెందిన ప్రజలు మొత్తం 355 వినతిపత్రాలను అందజేశారు. రెండు రోజులు జిల్లా పర్యటనకు వచ్చిన కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఆదివారం స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశం హాలులో ఎస్సీ ఉప కులాల్లోని వారి నుంచి అభిప్రాయాలను విన్నారు. వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

కుల వృత్తుల వేషధారణతో ప్రదర్శన

వర్గీకరణ అంశంపై అభిప్రాయ సేకరణకు వచ్చిన రాజీవ్‌రంజన్ మిశ్రాపర్యటన నేపథ్యంలో ఒంగోలులో మాల మహానాడు, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రకాశం భవనం ఎదుట ప్రదర్శన నిర్వహించిన అనంతరం రంజన్ మిశ్రా నిర్వహిస్తున్న సమావేశానికి వచ్చి తమ అభిప్రాయాలను వెల్లడించారు. కాగా ముందుగా నిర్వహించిన ప్రదర్శనలో మాలలు తమ వృత్తులను గుర్తు చేస్తూ హరిదాసుడు, కాటికాపరి వేషధారణలతో ప్రదర్శనలో పాల్గొనడం చూపరులను ఆకట్టుకుంది.

ఎమ్మార్పీఎస్ ప్రదర్శనలో డప్పులు పెద్ద ఎత్తునవాయిస్తూ ఆకట్టుకున్నారు. వృత్తులకు సంబంధించిన వేషధారణలతో పాటు వర్గీకరణకు వ్యతిరేకంగా, అనుకూలంగా వారు నినాదాలు చేస్తూ కోలాహలంగా ప్రదర్శన నిర్వహించారు.


ఒంగోలు నగరంలో డివైడర్ల మధ్య క్రేన్ సాయంతో అమర్చుతున్న గుర్రాల బొమ్మలు


డివైడర్లపై లైటింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నగర సుందరీకరణకు తుది మెరుగులు

● సంక్రాంతికి సిద్ధం చేసిన కార్పొరేషన్ అధికారులు

నగర సుందరీకరణ వైపు అడుగులు వేగంగా పడుతున్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో నగర అభివృద్ధి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నగరంలో మార్పులు మొదలయ్యాయి. ఇదిలా ఉంచితే ఎన్ క్యాప్ నిధులతో నగర సుందరీకరణకు కార్పొరేషన్ అధికారులు ప్రాధాన్యత ఇచ్చారు.

అందులో భాగంగా ఇప్పటికే ప్రధాన రహదారుల్లో సెంటర్ డివైడర్లను ఆకర్షించే రంగులతో అందంగా ముస్తాబు చేయగా, మరోవైపు సెంటర్ డివైడర్‌ల మధ్య పచ్చని మొక్కలు నాటించడంతోపాటు మధ్యలో అందమైన సీతాకోక చిలుకలు, గుర్రాలు, నెమలి బొమ్మలు ఏర్పాటు చేయడంతో ఒంగోలులోని ప్రధానమైన రోడ్లన్నీ డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన పక్షులు, జంతువులు, బొమ్మలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. మొత్తంగా నగర సుందరీకరణ పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

ఏఎన్ఎంలు గ్రామాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ టి. వెంకటేశ్వర్లు


ఏఎన్ఎంల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దశల వారీగా సమీకృత అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ నియమాలపై ఏఎన్ఎంలు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్ రూములో సోమవారం ఏఎన్ఎంల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రమాద సంకేతాలను గుర్తించాలన్నారు. అనీమియా, అధిక రక్తపోటు, మధుమేహం, ఎపిలెప్సి, ప్రసవ పూర్వ రక్తస్రావంతో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా శిశుమరణాలను నివారించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్కే నోడల్ అధికారి డాక్టర్ జి.భగీరధి, సుగుణమ్మ, డి.శ్రీనివాసులు, మాస్‌మీడియా అధికారి కె శ్రీదేవి, హెల్త్‌ఎడ్యుకేటర్ టి. శ్రీధర్ తదితరులు ఉన్నారు. అనంతరం అర్మాన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ చరణ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో డాక్టర్ టి. వెంకటేశ్వర్లు సోమవారం రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలును కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తెచ్చే విధంగా సహకారం అందించాలని కోరారు.

విద్యార్థుల స్వీయ అభ్యసనానికి పాల్ ల్యాబ్

ఒంగోలు విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థుల స్వీయ అభ్యసనానికి పాల్ ల్యాబ్స్ ఎంతోగానో దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పాల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని 2 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పాల్ ల్యాబ్‌లకు సంబంధించి ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి శిక్షణ సోమవారం స్థానిక రామనగర్‌లోని మునిసిపల్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి పాఠశాలకు 30 చొప్పున 840 ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఒంగోలు ఎంఈవో టి. కిషోర్‌బాబు, పరిశీలకులు డి. మాధవీలత, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ఉన్నారు.

నేడు, రేపు విద్యార్థులకు తరల్ మిడ్‌లైన్ పరీక్ష

ఒంగోలు విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, విలీన ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో తరల్ మిడ్‌లైన్ పరీక్ష నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో ఆదేశించారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష ఫలితాలను ఈనెల 10లోపు ఆన్‌లైన్‌లో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండల విద్యాధికారులు తమ పరిధిలోని అన్ని ప్రభుత్వ రంగ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై తగు ఆదేశాలు జారీ చేయాలని కిరణ్‌కుమార్ ఆదేశించారు.

రేపు జాబ్‌మేళా

ఒంగోలు కలెక్టరేట్,జనవరి 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వబాలుర ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 19నుంచి 30 ఏళ్లలోపు ఉండి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పూర్తిచేసిన నిరుద్యోగయువతీ, యువకులు ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 7989244381 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రజకులకుంట అభివృద్ధికి చేయూత

చీమకుర్తి, జనవరి6 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణ శివారున గరికమిట్ట సమీపంలో ఉన్న రజకులకుంట అభివృద్ధికి ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేయూతనందించారు. ఎన్ఎస్‌పీ కాలువ నుంచి నీటిసరఫరా సాఫీగా జరిగేలా దాదాపు ఇరవైఐదువేల రూపాయలతో మరమ్మతులు చేపట్టారు. తద్వారా రజకుల కుంటకు నీటి సరఫరాతో సమస్య తీరింది. ఆర్థిక సహకారం అందించిన మారం వెంకారెడ్డిని సోమవారం రజక సంఘనాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు.


ఇస్తిమా ప్రార్థన స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఇస్తిమా ప్రార్థన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9వ తేదీ నుంచి ఒంగోలు గుంటూరు రోడ్‌లోని ఐటీఐ కాలేజి సమీపంలో జరగనున్న ఇస్తిమా ప్రార్థన ఏర్పాట్లను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజులపాటు ఒంగోలులో ఇస్తిమా ప్రార్థనలు జరగడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని దామచర్ల తెలిపారు. ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఇస్తిమా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కట్టుదిట్టమైన భద్రత : ఎస్పీ

ఒంగోలు(క్రైం): నిజాముద్దీన్ తబ్లీగ్ ఇస్తిమా మూడు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఆవరణలో జరగనుంది. ఈమేరకు సోమవారం ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పోలీసు అధికారులకు తెలియజేశారు. ఈనెల 9,10,11 తేదీలలో జరిగే ఇస్తిమాకు లక్షకు పైగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.


ఆరో రోజు పరుగుపందెం పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

233 మంది రాత పరీక్షకు ఎంపిక

ఒంగోలు(క్రైం)జనవరి6 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు 319 మంది హాజరుకాగా రాత పరీక్షకు 233 మంది ఎంపికైనట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఆరోరోజు కానిస్టేబుళ్ల ఎంపికకు మొత్తం 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 319 మంది హాజరయ్యారు. వీరిలో 233 మంది రాత పరీక్షకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్.అదనపు ఎస్పీ అశోక్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు స్టడీమెటీరియల్

కొండపి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం జడ్పీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపి ణీ చేశారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్, స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.శ్రీదేవి, ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌మూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు, సభ్యులు నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ డిమాండ్ చేశారు.స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన గోపాలమిత్రల జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం ఎన్.వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది. అనంతరం గోపాలమిత్ర యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి. రాంబాబు, ఎస్. సాంబశివయ్య, కోశాధికారిగా పి. వెంకటరెడ్డితో పాటు మరో పదిమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

పేస్‌లో గెస్ట్‌లెక్చర్‌పై అవగాహన

ఒంగోలు విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎక్స్‌ప్లోరింగ్ డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్ అక్రాస్ డొమైన్స్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విట్ ఆంధ్ర యూనివర్శిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోకుల్ ఎండూరి డీప్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ , కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, ఏఐడీఎస్ విభాగాధిపతి కే సుధీర్ చక్రవర్తి, ఏఐఎంఎల్ విభాగాధిపతి హీనా కౌసర్, సమన్వయకర్తలు జీటీ హరికృష్ణమూర్తి, హరితా పటేల్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికారానికి దూరం చేయడమే వర్గీకరణ లక్ష్యం

టంగుటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దళితులను రాజ్యాధికారానికి దూరం చేయడమే ఎస్సీ వర్గీకరణ లక్ష్యమని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కెవీ కృష్ణారావు విమర్శించారు. సోమవారం ఆయన టంగుటూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రకుల రాజకీయ పార్టీల కుట్రల్లో భాగమే వర్గీకరణ అని చెప్పారు. ప్రస్తుత ఎస్సీ జనాభా సుమారు 27శాతం ఉంటుందన్నారు. ఈనిష్పత్తి ప్రకారం కుల గణన చేసి ఎస్సీ రిజర్వేషన్‌లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

జరుగుమల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిరోధించాలని ఎంపీడీవో రమణమూర్తి సూచించారు. జరుగుమల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన కిశోర ప్రకాశం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు బాల్యంలో భాగంగా సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలని కోరారు. ఎంఈవోలు నాగేంద్రవదన్, ఈవోఆర్డీ కొండలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పింఛన్‌లపై విచారణ

కొండపి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కొండపిలో ఆరోగ్య పింఛన్‌లు అందుకుంటున్న 11 మందిని అధికారుల బృందం విచారించింది. మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని పరిశీలించింది. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు తోపాటు ముగ్గురు ప్రభుత్వ డాక్టర్ల బృందం, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, కొండపి పంచాయతీ కార్యదర్శి బిల్లా అంకయ్య పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే గృహాలు నిర్మించాలని కోరుతూ ఈనెల 10వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని పలు కాలనీల్లో పర్యటించి కార్మికులు, ప్రజలతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన 22వేల మంది పట్టాలకు పొజిషన్ చూపించడంతోపాటు అర్హులైన వారందరికి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు

నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వంశీ



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర ప్రదేశ్ నిరుద్యోగసంఘం జిల్లా అధ్యక్షుడుగా పల్లె వంశీ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా వంశీ మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలతో పాటు వివిధశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేవరకు పోరాడతామన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ చిరంజీవి హెచ్చరిక ● పలు సమస్యలపై అర్జీలు ఇచ్చిన రైతులు


మార్కాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

మార్కాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని రాయవరం గ్రామంలో తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి వచ్చిన భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో ప్రజల భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థాన ఈవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని పోతలపాడు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు తమ భూములు దేవాలయాల భూమిగా చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు వివిధ భూసమస్యలపై అర్జీలు ఇచ్చారు. పోతలపాడు గ్రామానికి చెందిన సర్వే నెంబర్-34, 200, 24, 26, 29లో సుమారు 48 ఎకరాలు నిర్మమమేశ్వరుడి ఆలయ భూములుగా ఉండటంతో రైతులు అర్జీలను సమర్పించారు. కొన్నేళ్లుగా తమ పట్టా భూములు దేవుడి పేరుతో ఆన్‌లైన్‌లో ఉన్నా యని గాయం వెంకటరెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, రాచకొండ వెంకటయ్య, మెరుగు బాలగురవయ్య, బత్తుల గోపయ్య, ఆదిలక్ష్మమ్మ, కంచెర్ల జానకి రామయ్యలు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పోతలపాడులో ఎక్కువగా భూసమస్యలు ఉండడంతో 30 మంది వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. పత్తేపురంలో కూడా గతంలో జరిగిన రీసర్వేలో ఒకరి భూముల మరొకరి పేరుతో కొందరికి ఉన్న భూమి కంటే ఎక్కువగా మరికొందరికి తక్కువ భూములుగా ఉన్నట్లు పలు సమస్యలపై 17 అర్జీలను తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతి అర్జీకి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. దేవుడి పేరుతో ఉన్న భూములను మరలా రైతుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికను పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


తర్లుపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ్‌భాస్కర్

రసీదులు ఇవ్వనంటూ సర్వేయర్ హడావుడి

భూ సమస్యలపై వచ్చే ప్రతి అర్జీకి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రతి అర్జీకి రసీదు ఇవ్వనంటూ పోతలపాడు గ్రామ సర్వేయర్ విష్ణు భీష్మించుకు కూర్చున్నాడు. దీంతో అర్జీదారులు, సర్వేయర్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. సర్వే సమస్యపై ఎక్కువగా అర్జీలు వస్తుండడంతో అర్జీలు ఇవ్వనని సర్వేయర్ చెప్పాడు. దీంతోపాటు దేవుడి పేరుతో ఉన్న భూమల అర్జీలకు రసీదు ఇవ్వనంటూ భీష్మించుకు కూర్చున్నాడు. దీంతో వాగ్వాదం జరుగుతుండగా, రైతులు ఈ అంశాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన కలగజేసుకొని, ప్రతి అర్జీకి కచ్చితంగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. గ్రామంలో సర్వేయర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, సచివాలయంలో కూడా సర్వేయర్ విష్ణు విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని తహసీల్దార్‌కు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని బోయలపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దారు ఏ బాల కిషోర్ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవిన్యూ సదస్సులో మొత్తం 12 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల, రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామ రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున ప్రజలు, రైతులు ఈ రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విఆర్వోలు ఓబయ్య, చెన్నయ్య, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

పైప్‌లైన్‌లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మార్కాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35వ వార్డు పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో లీకులకు గురవుతున్న పైప్‌లైన్‌లకు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. 'పైపులోని నీరంతా వృథా' శీర్షికన ఈ నెల 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ప్రధానంగా స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లోనే పైప్‌లైన్లకు అధికారులు మరమ్మతులు చేశారు. మున్సిపల్ డీఈ ఎ.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏఈ భూపాల్‌రెడ్డి సిబ్బందితో కలిసి పైప్‌లైన్‌లకు మరమ్మతుల పనులు పర్యవేక్షించారు. కొన్నిచోట్ల ట్యాప్‌లు లేక నీరు వృథాగా పోతుండడంతో నూతన ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


కొళాయికి ట్యాప్ బిగిస్తున్న సిబ్బంది

రైల్వేట్రాక్‌ల వెంబడి గాలిపటాలు ఎగురవేయవద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

గిద్దలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైల్వేట్రాక్‌ల సమీపంలో గాలిపటాలు ఎగుర వేయవద్దని రైల్వే పోలీసులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేసే అంశంపై కెఎస్.పల్లి గ్రామంలో ప్రజలకు రైల్వేపోలీసులు అవగాహన కల్పించారు. రైల్వే లైన్ల వెంట విద్యుత్ తీగలు ఉన్న దృష్ట్యా గాలిపటాలు పొరపాటున హైటెన్షన్ తీగలను తాకే ప్రమాదం ఉందన్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉందన్నారు. ఒకవేళ గాలిపటాలు తీగలను తాకి కిందికి వేలాడితే వేలాడే గాలిపటాలను ముట్టుకున్న సందర్భాలలో విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే రైళ్లపై, గూడ్స్‌లపై ఆకతాయిలు అకతాయిలు రాళ్లు రువ్వితే ప్రయాణికులకు గాయాలు కావడమే కాకుండా ఒక్కొక్కసారి ప్రమాదం కూడా జరగవచ్చన్నారు. కావున ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయని ఆర్‌పీఎఫ్ ఎస్సై కే.పీ.రెడ్డి హెచ్చరించారు. వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది, సర్పంచ్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● ప్రభుత్వానికి రవాణా రంగ కార్మికులకు విజ్ఞప్తి


మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

గిద్దలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ల, క్లీనర్ల సంఘం ప్రతినిధి టి.పిచ్చిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో గిద్దలూరు ఏరియా ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రైవేటు విద్యాసంస్థల్లో వేలాదిమంది కార్మికులు బస్సు డ్రైవర్లుగా, క్లీనర్లుగా, స్వీపర్లుగా, వాచ్‌మెన్లుగా, అటెండర్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఇఎస్‌ఐ, ప్రమాద్‌బీమా తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆవులయ్య మాట్లాడుతూ రవాణా రంగంలోని వేల మంది కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఎన్నో పథకాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో బస్సు డ్రైవర్ల, క్లీనర్ల సంఘం ప్రతినిధులు నాగభూషణం, అబ్దుల్‌రహీం, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీని శ్రీశైలం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో తోకల రవి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని వసతులను, రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో ముమ్మరంగా వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎప్పటికప్పుడు గిరిజనులకు రోగాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా చలికాలంలో ప్రబలే వ్యాధులపై అవగాహన కలిగించాలన్నారు. వైద్యశాలకు మొదటిసారిగా వచ్చిన ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు కొటానాయక్, నయాబ్‌రసూల్, పీసీహెచ్ వెంకటేశ్వర్లు, హెచ్ఏ ఉదయ్ రంజన్, స్టాఫ్ నర్సు శ్రీలక్ష్మీ, సిస్టర్ ప్రియాంక, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన డీఎంగా శంకరరావు బాధ్యతలు


శంకరరావు

పొదిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొదిలి డిపో నూతన మేనేజర్‌గా వి.శంకర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు డిపో2లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌రావు పొదిలి డిపో నూతన డీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బంది, యూనియన్ నాయకులు ఆయనను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డిపోలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషిచేస్తానన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఒంగోలు(విద్య)జనవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఎస్సీఎస్టీ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఉద్యోగుల నూతన సంవత్సర డైరీలను, మహిళల హ్యాండ్ బ్యాగ్‌లను బ్యాంక్ జనరల్ మేనేజర్ కె. రాఘవయ్య ఆవిష్కరించారు.

బోగస్ పింఛన్లపై విచారణ


అర్ధవీడు మండలంలో విచారిస్తున్న వైద్యబృందం

గిద్దలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల పొందిన వారిని గుర్తించేందుకు వైద్యుల బృందం సోమవారం విచారించింది. రాచర్ల మండలంలో మంచానికి లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన 22 మంది నెలకు 15వేల రూపాయల వంతున పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించారు. వీరిలో ఎక్కువ మంది అనర్హులని ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్యుల బృందం సోమవారం విచారించింది. పింఛన్‌దారుల ఇళ్లకు నేరుగా వైద్యబృందం వెళ్లింది. బృందం సభ్యులైన డాక్టర్ టి.విద్యాసంజీవ్, డాక్టర్ ఎస్.గిరిరాజు, స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో కలిసి పక్షవాతంతో బాధపడుతూ మంచానికి లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన వారిని విచారించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు డాక్టర్లు తెలిపారు.

కంభం : గత ప్రభుత్వ హయాంలో బోగస్ సర్టిఫికెట్లతో నెలకు రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారిని పరీక్షించాలని రాష్ట్ర ప్రభు త్వం ఆదేశాల మేరకు సోమవారం అర్ధవీడు మండలంలో ఎంపీడీవో నరసయ్య ఆధ్వర్యంలో రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారిని ముగ్గురు వైద్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసయ్య మాట్లా డుతూ మండలంలో పక్షవాతంతో మంచానికే పరిమితమైన దివ్యాంగులు మొత్తం 17 మంది ఉండగా వీరిలో ఒకరు గత ఏడాది చని పోయారని, మిగిలిన 16 మందిలో వెలగలపాయలో ఉన్న ఏడుగురిని, అర్ధవీడు లోయ లో ఉన్న తొమ్మిది మందిని డాక్టర్ సీతారామిరెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ లక్ష్మి పరీక్షించినట్లు తెలిపారు. దివ్యాంగుల పరిస్థితిని డాక్టర్లు మొబైల్ యాప్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ తనిఖీలో వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నట్లు తెలిపారు.

పెద్ద దోర్నాల : మండలంలోని మంచానికి పరిమితమై రూ.15,000లు పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల స్థితిగతులను వైద్యాధికారుల బృందం సోమవారం పరిశీలించింది. మండలంలో 12 మంది లబ్ధిదారులు ఆ పింఛనును పొందుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఎం నాసర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యాధికారి సయ్యద్ అబ్దుల్ కలాం, వి.సాయికిరణ్, శంకర్‌రెడ్డి, సీహెచ్‌వో రాజేశ్, సచివాలయం సిబ్బంది ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పరిశీలనలో పాల్గొన్నారు.

అబాకస్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ


అబాకస్‌లో ప్రతిభ సాధించిన వాసవి విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6 ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణంలోని వాసవి విద్యానికేతన్ విద్యార్థులు అబాకస్ పోటీలలో ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, డైరెక్టర్ కందెపు రంగయ్య మాట్లాడుతూ, అబాకస్ పోటీలలో సీనియర్స్ విభాగంలో ఎస్.నాగచైతన్య రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. జూనియర్ విభాగంలో సీహెచ్.దక్షిత 5 నిమిషాలలో చేయాల్సిన విజువలైజేషన్ కాన్సెప్ట్ కేవలం 2.45నిమిషాలలో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొంది, రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. పీవీ నాగచైతన్య స్టార్ జూనియర్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విశ్వం ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మొత్తం 26 పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వాసవి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన అబాకస్ ట్రైనర్లయిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఏవో రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గిద్దలూరులో ప్రతిభచాటిన వాసవి విద్యార్థులు

గిద్దలూరు : రాచర్లలోని స్పందన విద్యాసంస్థలకు చెందిన 8 మంది విద్యార్థులు మార్కాపురంలో జరిగిన జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచారు. స్పందన స్కూలుకు చెందిన రంగదీక్షిత్, వర్షిణి, సాత్విక్, వర్షిత్, ఈశ్వరసాయి, రేవంత్, రంగచరణ్, త్రినాథ్‌లు ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా వారికి నిర్వాహకులు జ్ఞాపికలు సర్టిఫికేట్లు అందచేసినట్లు మేనేజింగ్ డైరెక్టర్ పి.సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జాతి వైరం మరిచి పిల్లికి పాలిచ్చిన శునకం


కుక్క వద్ద పాలు తాగుతున్న పిల్లి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతి వైరాలు మరిచి ఆకలితో ఉన్న పిల్లికి ఒక శునకం పాలు ఇచ్చిన ఘటన మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ షిరిడీసాయి ప్రసన్న మందిరం సమీపంలో ఆదర్శ అపార్ట్‌మెంట్ వద్ద చోటుచేసుకొంది. ఒక కుక్క వద్ద ఆకలిలో ఉన్నపిల్లి పాలు తాగుతూ కనిపించింది. ఈ దృశ్యం చూసిన జనాలు సంబరాచ్చర్యాలకు లోనయ్యారు. పిల్లికి, కుక్కకు జాతి వైరం ఉండటంతో రెండింటి మధ్య ఉన్న ఆప్యాయత చూసి సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్‌టోర్నమెంట్

పొదిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొదిలి జూనియర్ కళాశాల మైదానంలో యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో యువక్రికెటర్లు తమ సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, కాటూరి నారాయణప్రతాప్, గౌస్, పాఠశాల ప్రధానోపాధ్యయులు కరిమూన్‌బీబీ, బీవీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈగలపాడులో వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పర్యటన


గామ ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

పొదిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈగలపాడు గ్రామాన్ని రాష్ట్ర మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం సోమవారం సందర్శించారు. గ్రామంలో జ్వరాల తీవ్రత ఇటీవల ఎక్కువగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వచ్చి గ్రామ సర్పంచ్ సుబ్బులు, వైద్యసిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. పరిసరాలను పరిశీలించారు. వీధులన్నీ శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించడంతో పాటు ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. జ్వరంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి జ్వర పీడితుల నుండి రక్త నమూనాలను సేకరించారు. డెంగ్యూ, మలేరియా కిట్ల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నివాసగృహాల సమీపంలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిరోజూ గ్రామాన్ని సందర్శిస్తూ ఎప్పటికప్పుడు జ్వర బాధితుల పరిస్థితిని తెలుసుకుంటూ ఉండాలని వైద్యసిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో డీఎంవో శ్రావణకుమార్, వైద్యాధికారి సుగుణకుమార్, డాక్టర్ శరత్, ఎంపీడీవో శోభన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి పవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన గోపాలమిత్రల జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం ఎస్.వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ గోపాలమిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వారు ఆరు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం గోపాలమిత్ర యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి. రాంబాబు, ఎన్. సాంబశివయ్య, కోశాధికారిగా పి. వెంకటరెడ్డితో పాటు మరో పదిమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రైవేటు హెల్పర్‌కు విద్యుత్‌షాక్

గిద్దలూరు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు గ్రామంలో విద్యుత్ స్తంభాలపై విద్యుత్ బల్బులు మారుస్తున్న సందర్భంలో దేవరాజు అనే ప్రైవేటు విద్యుత్ హెల్పర్ తీవ్రంగా గాయపడ్డాడు. కొమ్మునూరు సచివాలయ విద్యుత్ ఉద్యోగి తరఫున సహాయకుడిగా దేవరాజ్ పనిచేస్తున్నాడు. దీంతో ఆయనకు విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడగా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలించారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పుల్లలచెరువు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటు సారాబట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సోమవారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని చిన్న పీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాం తంలో బట్టీలపై దాడులు చే శారు. సారా కోసం నిల్వ ఉంచిన 200 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన గంగమ్మ

కొనకనమిట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలం లోని ఎదురాళ్లపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది. గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెంది న నాగం గంగమ్మ పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మార్కాపురం వైపు నుంచి కనిగిరికి వెళుతున్న కారు ప్రమాద వశాత్తు అదుపుతప్పి గంగమ్మను బలంగా ఢీకొట్టి సమీప పొలాల్లోకి వెళ్ళింది. దీంతో గంగమ్మ(42) రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. మృతురాలికి భర్త కొండయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కొనకనమిట్ల పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రహదారి విషయంలో ఘర్షణ

● ఐదుగురికి తీవ్రగాయాలు

బేస్తవారపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రహదారి విషయంలో రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని జగన్నాయకుల వీధిలో సోమవారం చోటుచేసుకొంది. రెండు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. పార్కింగ్ విషయంలో, రహదారి విషయంలో ఎర్రమౌలాలి, దూదేకుల ఖలీల్ కుటుంబాలు ఘర్షణ పడ్డాయి. ఖలీల్, తమ్ముడు సద్దాంహుస్సేన్‌లు బీరుసీసాలతో, కత్తులతో ఎర్రమౌలాలి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో మౌలాలి తలకు గాయాలయ్యాయి. ఎదురు దాడిలో ఖలీల్ తలకు గాయాలు కాగా సద్దాంహుసేన్‌కు, బాతులమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం వైద్యశాలకు తరలించారు ఇరువురి ఫిర్యాదుల మేరకు బేస్తవారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమ పితామహునికి నివాళులు


నివాళులు అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గిద్దలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతిని ఏపీటీఎఫ్ ఘనంగా నిర్వహించింది. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ నెల 11వ తేదీన నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి బాలకృష్ణమ్మ స్మారక సభను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వై.శ్రీనివాసులు, ఎస్.హెచ్.కబీర్, పాండురంగస్వామి, పాండు, ఖాదర్‌వలి, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈ నెల 8న ఉదయం 11 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు, దోసకాయలపాడుల్లో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మంగళవారం మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వి.శ్రీనివాసరావు తెలిపారు. తాళ్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తాళ్లూరు, విఠలాపురం, రజానగరం గ్రామాలకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అలాగే, దోసకాయలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని శింగన్నపాలెం, తోటవెంగన్నపాలెం, దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్రాంతి ప్రాముఖ్యతను తెలిపేందుకే ముగ్గుల పోటీలు

దొనకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యతను తెలిపేందుకే ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు గౌతమీ డిగ్రీ కాలేజీ అడ్మిన్ నాని పేర్కొన్నారు. చైర్మన్ గుండారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కెజీబీవీ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.లక్షా 27వేలు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు వివిధ కానుకల రూపంలో రూ. 1,27,622 సమర్పించినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.34,900, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.18,610, శాశ్వత అన్నదానానికి రూ.18,480, మహా ప్రాకార నిర్మాణానికి రూ.50,116, పంచామృత అభిషేకానికి రూ.5,516 వచ్చినట్లు తెలిపారు. కాగా పొదిలి విశ్వనాధపురంకు చెందిన యడవల్లి రమేష్‌బాబు విజయలక్ష్మి దంపతుల కుమార్తెలు వైష్ణవి, లిఖితలు మహాప్రాకార నిర్మాణానికి రూ. 50 వేల నగదును దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణకు అందజేశారు.

టీడీపీ నేత నారాయణరెడ్డి మృతి బాధాకరం

దర్శి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రోబనపల్లి గ్రామ టీడీపీ నాయకుడు మేడగం కాశి నారాయణరెడ్డి మృతి బాధాకరమని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని గృహంలో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ నాయకులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మారం శ్రీనివాసులురెడ్డి, బొగ్గవరపు సుబ్బారావు, ఆవుల సుబ్బారావు, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

తాళ్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు అన్నారు. స్థానిక ఏబీసీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరావు, కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగువారిపాలెం ఎంపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలు, పౌష్టికాహారం, విద్యా వికాసం గురించి ప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించటంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్టు చెప్పారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిలో శారీరక, మానసిక వికాసాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సునీత, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులు పెంపొందించాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేదలు నివసిస్తున్న కాలనీల్లో మౌలిక వసతులు పెంపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం ఒంగోలులోని కలెక్టర్ చాంబర్‌లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఆమెను కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం నిధులు మ్యాచింగ్‌తో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టే విధంగా సహకరించాలని కోరారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాతో చర్చిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఎస్పీ దామోదర్‌ను కలిసిన డాక్టర్ లక్ష్మి

ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి శాంతి భద్రతలపై చర్చించారు. అమాయకులైన టీడీపీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన తప్పుడు కేసులను తొలగించేందుకు శ్రీకారం చుట్టడం పట్ల ఎస్పీ దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఎన్నికల సమయంలో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసిన వైసీపీ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు.

ఉపాధి సిబ్బందిపై కొరడా

- » అవినీతికి పాల్పడినవారిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు
- » రిజిస్టరు పోస్టు ద్వారా కార్యాలయానికి చేరిక
- » పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు

వీసీపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై వేటు పడింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు అవినీతికి పాల్పడిన ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వులు రిజిస్టరు పోస్టు ద్వారా ఎంపీడీవో కార్యాలయానికి చేరాయి. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 549 పనులకు 11.95 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు సంబంధించి 22పనులకు 1.25కోట్లు మొత్తం 12.26కోట్లు ఖర్చుచేశారు. ఈ పనులకు సంబంధించి సెప్టెంబరులో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మండలంలో చేపట్టిన ఉపాధి పనులలో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

సామాజిక తనిఖీ అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆడిట్ బృందం అధికారుల ఎదుట నివేదికలను వెల్లడించారు. మండలంలో 328 పనులకు సంబంధించి రూ.61.77లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ అక్రమాలలో ఏపీవో సుబ్బారావు, కంప్యూటర్ ఆపరేటర్ షరీఫ్, టీఏలు వీరాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వై.శేఖర్ కిషోర్, వెంకటేశ్వర్లుతో పాటు ఈసీ సత్యనారాయణను బాధ్యులను చేస్తూ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించడంతోపాటు నేరుగా తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని పీడీ జోసెఫ్‌కుమార్ నోటీసులు పంపించారు. ఎంపీడీవో కార్యాలయానికి పోస్టు ద్వారా వచ్చిన ఈ నోటీసులను సస్పెండ్ అయిన ఉద్యోగులు అందుకున్నారు. కాగా ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగిన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేసిన 18మందికి వారిపై నమోదైన అభియోగాలకు వివరణ ఇవ్వడంతో పాటు రికవరీ చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీచేశారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

దొనకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల నుంచి రైతులను విముక్తులను చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈసందర్భంగా భూసమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.రామారావు, వీఆర్వో మాచర్ల, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



పామూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమణారావు



దొనకొండ: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

రైతుల సమస్యల పరిష్కారానికే సదస్సులు

పామూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాలకు సంబంధించి సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ బీవీ రమణారవు తెలిపారు. సోమవారం మండలంలోని బలిజపాలెంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా 13 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నంగి రమణమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రేగలగడ్డ కోటేశ్వరరావు, ఎంఆర్ఐ బి.మల్లికార్జునరావు, వీఆర్వో షేక్ ఖాజావలి, ఈవో నరసింహబాబు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లు తొలగించాలంటూ మహిళల ఆందోళన

దొనకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో బెల్ట్ షాప్‌లు తొలగించాలంటూ రుద్రవరం మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యం బెల్ట్‌షాపులు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. ఈక్రమంలో యువకుల నుంచి వృద్ధుల వరకు మద్యం సేవించి అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు ఆమె ముందు తాము పడుతున్న బాధలను ఏకరువుపెట్టారు. బెల్ట్‌షాపుల్లో 24 గంటలు మద్యం అమ్మకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని వాపోయారు. దీంతో తమ కుటుంబసభ్యులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని మద్యం బెల్ట్ షాపులను తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రమాదేవి ఎక్సైజ్ సీఐ, పోలీసు అధికారులతో ఫోన్‌లో చర్చించారు. రుద్రసముద్రం గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు, పెదరావిపాడు గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పంచాయతీ పరిధిలోని రెండు గ్రామాల్లో చికెన్ గున్యాతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు ఆధ్వర్యంలో సోమవారం వీధుల్లో బ్లీచింగ్, మురుగు కాలువల్లో ఎబేట్ చల్లిస్తున్నారు.

వీధుల్లో చెత్తా చెదారం తొలగించటంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



తమ్మలూరులో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

కనిగిరిలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు

కనగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన శిబిరంలో జనని చారిటబుల్ ట్రస్ట్, ఒమెగా హాస్పిటల్స్ సహకారంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 93 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన ప్రతి 50మందిలో ఆరుగురికి క్యాన్సర్ ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తున్నట్లు ఒమెగా హాస్పిటల్స్ వైద్య నిపుణులు శుభశ్రీ తెలిపారు. ఈ పరీక్షల ఫలితాలు పది రోజుల తర్వాత అందిస్తామని ఆమె తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో తెలుగు మహిళలు కరణం అరుణ, షేక్ వాజిదాబేగం, తులసి, దొరసాని, జంషీర్ అహ్మద్, షరీఫ్‌లు వివిధ సేవలు అందజేశారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కురిచేడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ట్రస్టుద్వారా స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి వీటిని పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆర్.వస్రాంనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి, ఎంపీటీసీ బుల్లం వెంకట నరసయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అసైన్‌మెంట్ భూముల్లో సాగుచేస్తున్న రైతుల వివరాలను కూడా సేకరించాలన్నారు.

పాసుబుక్ ఉన్న యజమాని చనిపోతే ఆ పాసుబుక్ మరలా ఎవరి పేరు మార్చాలనేది పరిశీలించాలన్నారు. అవసరమైతే వీఆర్‌వోలు వారి ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించాలన్నారు. ఈక్రాప్ నమోదు చేయించుకుంటేనే ఇన్సూరెన్స్ వస్తుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అభిప్రాయ సేకరణ

కనగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు, సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఈ ఏ.వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి వ్యక్తిగతంగా కానీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కానీ అభిప్రాయాలను నమోదు చేసుకోనున్నట్లు తెలిపారు.

ఈనెల 7, 8 తేదీల్లో నేరుగా అయితే విజయవాడలోని బృందావన్ కాలనీలో గల ఏ కన్వెన్షన్ సెంటర్‌లో, 10వ తేదీ కర్నూలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఇందుకోసం వినియోగదారులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440812197, 9440812364 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటుపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుధీర్ అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు ఆకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరు మోటార్‌సైకిల్‌పై మోటుపల్లి నుంచి దర్శికి వస్తున్నారు. మంచు బాగా కురుస్తుండటంతో ఎదురుగా వస్తున్న వరికోత మిషన్ కనిపించక ఢీకొట్టడంతో సుధీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ఆకాష్‌ను 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



మృతిచెందిన సుధీర్

ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

కనగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద ఘటనలో ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.50 వేలు పరిహారం విధిస్తూ కనిగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర సోమవారం తీర్పు ఇచ్చారు. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల రామాంజనేయరెడ్డి అనే వ్యక్తి కనిగిరిలోని సెల్ టవర్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తన స్వగ్రామం నుంచి బైకుపై వస్తుండగా కనిగిరి పట్టణ సమీపంలోని కంభం రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. 2017లో జరిగిన ఈఘటనపై కనిగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈప్రమాదం ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తతో జరిగినట్లుగా విచారణలో తేలటంతో డ్రైవర్ మానికాల బాలాజిపై శిక్షను న్యాయాధికారి ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చారు.

క్రికెట్‌లో రాణిస్తున్న పామూరు విద్యార్థి

పామూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో పామూరు విద్యార్థి రాణిస్తున్నాడు. చిత్తూరు జిల్లాస్థాయిలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్వీ జూనియర్ కళాశాల తరుపున కెప్టెన్‌గా వ్యవహరించి విజేతగా నిలిచారు. పామూరు పంచాయతి పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు, పరిమిళ దంపతుల ఏకైక కూమారుడు అభినంద్ పదో తరగతి వరకు పామూరులో చదివాడు. తిరుపతి ఎస్వీ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో ఎస్వీ కళాశాల జట్టు, ఎమరాల్డ్ జట్టు తలపడ్డాయి. అభినంద్ కెప్టెన్‌గా వ్యవహరించిన ఎస్వీ కళాశాల విజేతగా నిలిచింది. చిత్తూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఎస్వీ కళాశాల జట్టు కప్ అందుకుంది. ఈసందర్భంగా అభినంద్‌కు తల్లిదండ్రులతో పాటు పామూరు, గోపాలపురం గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



అభినంద్

క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి

పామూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ జడ్పీటీసీ బొల్లా మాల్యాద్రిచౌదరి జ్ఞాపకార్థం మండలంలోని గుమ్మలంపాడు గ్రామంలో ఈనెల 9 నుంచి నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న జీఎంపీ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జి.శ్రీనువాసులు, పువ్వాడి రామారావు, డోలా శేషాద్రి, జి.కిరణ్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈపంట నమోదులో తప్పుల సవరణ

తాళ్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రబీ సాగులో నమోదుచేసిన ఈ-పంటలో తప్పులను సరిచేయటం కోసం తహసీల్దార్, వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో సూపర్ చెక్ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు-1 రైతు సేవాకేంద్రం పరిధిలో ఈక్రాప్ నమోదు చేసిన పంటల వివరాలను తహసీల్దార్ కె.సంజీవరావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు సోమవారం సూపర్ చెక్ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈపంట నమోదు చేసిన వివరాలను పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే సరిచేసి మరలా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్‌వో నాగలక్ష్మి, వీఏఏ నాగరాజునాయక్, విలేజ్ సర్వేయర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో మెగా గ్రౌండింగ్ మేళా

ఒంగోలు నగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులో లబ్ధిదారులకు మెగా గ్రౌండింగ్ మేళాను నిర్వహించబోతున్నట్లు వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగుశిక్షణ కేంద్రంలో ఆయనబ్యాంకు అధికారులతో మెగా గ్రౌండింగ్ మేళా గురించి సమావేశం అయ్యారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ ,లక్‌పతిదీదీ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకులు త్వరితగతిన రుణాలను మంజూరు చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ బ్యాంకు అధికారులను కోరారు.

మెగా గ్రౌండింగ్ మేళాలో ఎక్కువ మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని పీడీ కోరారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద ఇప్పటికే 250 దరఖాస్తులు బ్యాంకుల వద్దకు చేరాయన్నారు. వాటిలో కేవలం 50 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నారు. మిగిలిన దరఖాస్తులకు కూడా వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద అన్ని బ్యాంకుల వద్ద 3 వేలదరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పీడీ రవి బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. వీటిని వెంటనే పరిశీలనచేసి రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 55 దరఖాస్తులు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్న 40 దరఖాస్తులనువెంటనే బ్యాంకులకు పంపించాలని సంబంధిత అధికారులను కోరారు.

సమావేశంలో లీడ్ డిస్ట్రిక్టు మేనేజర్ రమేష్‌బాబు, కేవీఐబీ డిప్యూటీ డైరెక్టర్ సత్యసాయిమణి, ఐపీవో థామ్సన్, వెలుగు డీపీఎంలు డేవిడ్‌పాండే, సునీత, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ డిమాండ్ చేశారు.స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన గోపాలమిత్రల జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం ఎస్.వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది. రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో గత 20 ఏళ్ల నుంచి పశువులకు సకాలంలో వైద్యం అందించడంలో కీలకంగా ఉన్న గోపాలమిత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఆరు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం గోపాలమిత్ర యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.రాంబాబు, ఎన్. సాంబశివయ్య, కోశాధికారిగా వి.వెంకటరెడ్డితో పాటు మరో పదిమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు 355 దరఖాస్తులు

ఒంగోలునగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రజల అభిప్రాయ సేకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు జిల్లాలో వివిధ కుల సంఘాలు, దళిత సంఘాలు,ఎస్సీఉద్యోగసంఘాల, ఎస్సీ వర్గానికి చెందిన ప్రజలు మొత్తం 355 వినతిపత్రాలను అందజేశారు. రెండు రోజులు జిల్లా పర్యటనకు వచ్చిన కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఆదివారం స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశం హాలులో ఎస్సీ ఉపకులాల్లోని వారి నుంచి అభిప్రాయాలను విన్నారు. వారినుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

కుల వృత్తుల వేషధారణతో ప్రదర్శన

వర్గీకరణ అంశంపై అభిప్రాయ సేకరణకు వచ్చిన రాజీవ్‌రంజన్ మిశ్రా పర్యటన నేపథ్యంలో ఒంగోలులో మాల మహానాడు, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రకాశం భవనం ఎదుట ప్రదర్శన నిర్వహించిన అనంతరం రంజన్ మిశ్రా నిర్వహిస్తున్న సమావేశానికి వచ్చి తమ అభిప్రాయాలను వెల్లడించారు.కాగా ముందుగా నిర్వహించిన ప్రదర్శనలో మాలలు తమ వృత్తులను గుర్తు చేస్తూ హరిదాసుడు, కాటికాపరి వేషధారణలతో ప్రదర్శనలో పాల్గొనడం చూపరులను ఆకట్టుకుంది. ఎమ్మార్పీఎస్ ప్రదర్శనలో డప్పులు పెద్ద ఎత్తునవాయిస్తూ ఆకట్టుకున్నారు. వృత్తులకు సంబంధించిన వేషధారణలతో పాటు వర్గీకరణకు వ్యతిరేకంగా, అనుకూలంగా వారు నినాదాలు చేస్తూ కోలాహలంగా ప్రదర్శన నిర్వహించారు.

పట్టణ వ్యవహారాల కమిటీపై సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లోని కమిటీహాలులో సోమవారం గృహ, పట్టణ వ్యవహార కమిటీపై చైర్మన్, ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సమావేశమయ్యారు. పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ, కేంద్ర పర్యాటకమంత్రిత్వశాఖ, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, హౌసింగ్‌అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఆయా అంశాలపై కమిటీ చైర్మన్ మాగుంట పలు సూచనలు చేశారు.




ముగ్గుల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన కళాశాల విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి


ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత అద్దేపల్లి సునీత


ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత బీ ఉమాదేవి


మూడో బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత తిరుమల

మురిసిన మనసులు..
ముత్యాల ముగ్గులు..!

- సప్తవర్ణశోభితమైన నేల
- ముందుగానే వచ్చిన సంక్రాంతి శోభ
- బాపట్లలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, విదార్థినులు
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి


రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు


అద్దేపల్లి సునీతకు ప్రథమ బహుమతి అందిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్ దంపతులు


బి.ఉమాదేవికి రెండో బహుమతి అందిస్తున్న జేసీ ప్రఖర్ జైన్ తదితరులు


ఎన్.తిరుమలకు మూడో బహుమతి అందిస్తున్న బిల్డర్ గుండ్రెడ్డి శివ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన రంగవల్లులతో ప్రాంగణమంతా కూడా సప్తవర్ణ శోభితమైంది. వయోభేదం లేకుండా చిన్నారులు మొదలుకుని విద్యార్థినులు, గృహిణులు పోటీపడి ముగ్గులేసి వారం ముందే సంక్రాంతి శోభను కనుల ముందుంచారు. సోమ వారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీలకు బాపట్ల మున్సి పల్ హైస్కూల్ వెనక ఉన్న రోడ్డు వేదికగా నిలిచింది. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా స్పాన్సర్ చేయగా.. జిల్లా కలెక్టర్ వెంకటమురళి ప్రారంభించారు. జేసీ ప్రఖర్‌జైన్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ సతీ సమేతంగా వచ్చి ముగ్గులను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ బిల్డర్, కర్లపాలెం మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ కార్య క్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించారు.

ఉత్సాహంగా.. పెద్ద సంఖ్యలో..

ముగ్గుల పోటీలకు మహిళల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. మొత్తం 114 మంది రంగవల్లుల పోటీల్లో పాల్గొనగా ఇందులో 50మంది వరకు కళాశాల విద్యార్థినులు, పాఠశాల బాలికలు పాల్గొనడం వారి ఆసక్తికి నిదర్శనంగా ఉంది. తెలుగు వారి సంప్ర దాయాలతో పాటు సంక్రాంతి విశిష్టతను చాటే విధంగా వివిధ ఆకృతులలో ముగ్గులను వేసి ఇలపై ఇంద్రధనస్సును ఆవిష్కరింపజేశారు. బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా మహిళలు హాజరై ముగ్గుల పోటీల్లో పాల్గొని వారి ఇష్టాన్ని చాటుకున్నారు.

మొదటి మూడింటితో పాటు.. ప్రోత్సాహక బహుమతులు

మొత్తం 114మంది మహిళలు పోటీల్లో పాల్గొనగా ప్రథమ బహుమతి కింద రూ.6,000 నగదు పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన అద్దేపల్లి సునీత గెలుచుకోగా, ద్వితీయ బహుమతి కింద రూ.4,000 జిల్లెలమూడికి చెందిన బి.ఉమాదేవి, తృతీయ బహుమతి రూ.3,000ను ఎంవీరాజుపాలెం నివాసి ఎన్ తిరుమల గెలుచుకున్నారు. ఇవే కాకుం డా ప్రోత్సాహక బహుమతులను మరో ఏడుగురికి అందజేశారు. చెరుకుపల్లికి చెందిన సూరగాని లక్ష్మీకాంతమ్మ, బాపట్ల రైలుపేటకు చెందిన ఎం గుడారంకమ్మ, బాపట్లకు చెం దిన ఎం పద్మలత, వైఎస్సార్ నగర్ వెస్ట్ బాపట్లకు చెందిన కనకకుమారి కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న బాపట్ల పబ్లిక్ స్కూల్‌కు చెందిన మనశ్విని, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విదార్థిని పీ బార్గవి, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పి.వెన్నెల వర్షిణి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అభినందనలు : కలెక్టర్

కొన్ని తరాల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాల ను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన చిన్నారులకు, విద్యార్థులతో మాట్లాడి ఆల్‌ద బెస్ట్ చెప్పారు. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం ముగ్గులపై వారి ఆసక్తికి నిదర్శనమ న్నారు. పోటీలు ముగిసిన తర్వాత విజేతలకు బహుమతులను జేసీ ప్రఖర్‌జైన్‌తో పాటు ఏఎస్పీ విఠలేశ్వర్ దంపతులు అందజేశారు.





చాలా ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో దూరం నుంచి ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చాను. మొదటిబహుమతి గెలుచుకుంటానని అసలు ఊహించలేదు. ఈ ముగ్గుల పోటీలను చూస్తుంటే వారం రోజుల ముందుగానే పండుగ వచ్చినట్లయింది.

- అద్దేపల్లి సునీత, సత్తెనపల్లి(ధూళిపాళ్ల), ప్రథమ బహుమతి విజేత

ప్రతి ఏడాది పాల్గొంటాను

ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గులపోటీల్లో ప్రతి ఏడాది పాల్గొంటాను. ఇప్పటికీ 16సార్లు పాల్గొన్నాను. గతంలో చాలా బహుమతు లు గెలుచుకున్నాను. ఇప్పుడు రెండోస్థానంలో నిలవడం ఆనందంగా ఉంది.

- బి. ఉమాదేవి, జిల్లెళ్లమూడి, ద్వితీయ బహుమతి విజేత

వేడుకలా ఉంది

ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొనడం, మూడో బహుమతి గెలవడం సంతోషంగా ఉంది. ఇంతమందితో కలిసి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మరచిపోలేను. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపడుతున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అభినందనలు.

- ఎన్ తిరుమల, ఎంవీరాజుపాలెం, తృతీయ బహుమతి విజేత


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

పందెం కోళ్లు కత్తి కట్టి కాలు దువ్వడానికి సిద్ధం అవుతుంటే, రూ.కోట్లలో పందాలు వేసేందుకు వీలుగా బరులను సిద్ధం చేస్తున్నారు. మరో వారంలో పండు గ సందడి మొదలవుతున్న తరుణంలో కృష్ణానది తీర ప్రాంతాలు, సముద్ర తీర మండ లాల్లో కొన్నిచోట్ల ఇప్పటికే కోడి పందాల కోసం బరులు ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమ య్యారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న బరుల కోసం ఇప్పటికే రబీ పంట వేసిన చేలను తీసు కుని పది నుంచి 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అన్ని ఏర్పాట్లతో బరికి సిద్ధమవుతున్నా రు. మరోపక్క కేవలం పందెం కోసమే పెంచుతూ వస్తున్న కోడి పుంజులు లక్షలు పలుకు తున్నాయి. వీటి ధరే ఇంత ఉంటే వాటితో వేసే పందాలు ఎంతటి స్థాయిలో ఉంటాయనేది ఊహకందని విషయమే. కేవలం కోడిపందాలే కాకుండా కోతముక్క, గుండాట వంటి మి గిలిన జూద క్రీడలకు ఈ బరులు ఏర్పాటుచేస్తున్న ఆవరణలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పా టు చేస్తున్నారు. వీటితో పాటు మద్యం, బిర్యానీ కేంద్రాలకు కొదవే లేకుండా చూసేందుకు కూడా వెనుకాడటం లేదు.

బరి తెగింపునకు సిద్ధం


చెరుకుపల్లి మండలం పుషాడపువారిపాలెం దగ్గర ఎక్సకవేటర్‌లు, ఇతర యంత్రాలతో కోడి పందాల కోసం బరి సిద్ధం చేస్తున్న చిత్రం

- సంక్రాంతి వేళ కోడి పందాలకు సిద్ధమవుతున్న తీరం
- జూదం, మద్యం దుకాణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- చివరిలో మ్యూజికల్ నైట్స్‌కూ సన్నాహాలు
- ఇప్పటి నుంచే లాడ్జీలూ బుకింగ్

తెనాలి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన గుంటూరు జిల్లా నుంచి సముద్ర తీరంలోని బాపట్ల జిల్లా వరకు కోడి పందాలకు కొదవ లేకుండా బరులు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రెండు నుంచి ఐదు కి.మీ దూరంలో ఒక బరి ఉండేలా ఏర్పాట్లు చేస్తే, ఇప్పుడు మాత్రం వాటి ని తగ్గించి కేవలం జూదం కోసమే కాదన్నట్లు పరిమితంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టి ప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ప్రస్తుతానికి 8 చోట్ల పెద్ద స్థాయి బరులు ఏర్పాటు చేసేందుకు నేతల నుండి అనుమతి దక్కినట్లు సమాచారం. అటు సముద్ర తీర మండలాల్లోని నిజాంపట్నం, నగరం, వీవీ పాలెం, కర్లపాలెం, బాపట్ల మరికొన్ని చోట్ల కోడి పందాలకు చిన్నస్థాయి నుంచి పెద్దస్థాయి వరకు బరులు ఏర్పాటు అవుతున్నాయి. దుగ్గిరాల మండలంలో ఒక చోట, కొల్లిపర మండలంలో రెండు చోట్ల, కొల్లూరు మండలంలో రెండు చోట్ల, భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఒక్కొక్క చోట బరులు ఏర్పాటు చేసేందుకు నేతలు ఒకే అన్నారంటూ వాటిని స్థానిక నాయకులు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసేందుకు పెద్ద పెద్ద ఎక్సక వేటర్‌లను దించేశారు. బరులు వేసే ప్రాంగణం చుట్టూ సిమెంట్ దిమ్మెలు, ముళ్ల కంచె సాయంతో ఫెన్సింగ్ వేస్తూ లోపల మాత్రం ఐదు నుంచి 10 వరకు బరులు ఉండేలా ఒక్కో చోట సిద్ధం చేస్తున్నారు.

మద్యం, జూదానికి ఫుల్ డిమాండ్...

కోడి పందాల కోసం ఏర్పాటు చేసే బరులను ఆయా ప్రాంతాల నేతల అనుచరులు, కింది స్థాయి నేతలు తమ ఆధీనంలో సిద్ధం చేస్తుంటే దానిలో కేవలం కోడి పందాలకే కాకుండా జూదం, మద్యం శిబిరాలకు మంచి డిమాండ్ పలుకుతోంది. సాధారణంగా ఒక బరిని ఏర్పాటు చేయాలంటే దానికి అంగీకారం తెలిపే నేతలకు, పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ వంటి సంబంధిత శాఖల అధికారులకు పందాలు నిర్వహించే వారం నుంచి పది రోజుల గడువునకు బరి స్థాయిని బట్టి రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు మమూళ్లు ఇవ్వడం పరిపాటి. అంత మొత్తంలో రాబట్టుకునేందుకు నిర్వాహ కులు కూడా రూ.50 వేలు, రూ.లక్ష రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పందాలు వేసుకునేందుకు వీలుగా ప్రత్యేక బరులను సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటే మద్యం దుకాణాలు, బిర్యానీ సెంటర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఒక్కోదానిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వేలంలో వారికి అప్పగించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. కోడి పందాలు చూడా లన్నా, కోడిని బరిలో దింపాలన్నా ఫీజు చె ల్లించాల్సిందే. పందెం కాసిన మొత్తంలోనూ పది శాతం నిర్వాహకులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి కాక పార్కింగ్, కోతముక్క, గుండాట వంటి శిబిరాలకు లక్షల్లోనే డిమాండ్ ఉంటోంది. గతంలో బరులు ఎక్కువగా ఉండటంతో పందెం వేసే వారిని ఆకట్టుకునేందుకు బుల్లెట్ నుంచి కారు వరకు బహుమతులు అందించిన వా రు ఉన్నారు. అయితే ఈ సారి బరులు పరిమితంగానే ఉండటంతో ఇటువంటి ఆకర్షణీయ బహుమ తులు ఏ స్థాయిలో ఉంటాయో చూడాల్సిందే

కోడి పందాలకు స్థానికంగా ఉండే వారే కాకుండా తెలంగాణా నుంచి కూడా భారీ సంఖ్యలో ఏటా వస్తుండటంతో పట్టణాల్లో లాడ్జీలు కూడా ఇప్పటి నుంచే నిండిపోతు న్నాయి. కొన్ని చోట్ల నిర్వాహకులే కొన్ని లాడ్జి లను రిజర్వ్ చేసుకుని పెట్టుకుంటుంటే పట్టణా లకు దూరంగా బరులు ఉన్నచోట మాత్రం ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు తీసుకుని తమ అధీనంలో ఉంచుకుంటున్నారు. ఇదిలా ఉంటే సంక్రాంతి పండుగ చివరి రెండు రోజులు కోడి పందాలతో పాటు ముగింపు వేడుకల కింద మ్యూజికల్ నైట్స్ కూడా ఏర్పాటు చేసేందుకు శిబిరాలను ఇప్పటి నుంచే కేటాయిస్తున్నారు. వీటిలో సరదాగా జనానికి ఒక చోట అయితే వీఐపీలకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి అన్ని వసతులు కల్పించేందుకు కూడా హైటెక్ సొగసులతో తీర్చిదిద్దేందుకు గృహోపక రణ సామాగ్రిని దింపేస్తున్నారు. పండుగ దగ్గర పడుతుండటంతో పందెం కోళ్ల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఒక్కో కోడి పుంజు రూ.20 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోందని పెంప కందారులు చెబుతున్నారు. మొత్తం మీద సంక్రాంతి వేళ కోడి పందాల వేడుకలు మాత్రం జూద క్రీడలకు సిద్ధమవుతోంది.


పందాల కోసం సిద్ధంగా ఉన్న కోళ్లు


చిన్న చిన్న బరుల కోసం సిమెంట్ దిమ్మెలతో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్న చిత్రం

పర్చూరులో విషాదం

- అక్కా చెల్లెళ్లు సజీవదహనం
- షార్ట్ సర్క్యూట్‌తో ఘటన
- తీవ్రంగా గాయపడిన తల్లి

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో అక్కా చెల్లెళ్లు సజీవదహమయ్యారు. కుటుంబంలో ఇద్దరు ఆహుతి కావడం గ్రామస్థులను కలచివే సింది. కళ్లెదుటే కూతుళ్లు మంటల్లో కాలిపో తున్నా ఏమీచేయలేని స్థితిలో తల్లి కూడా తీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థితిలో ఆసు పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. తన కుమార్తె లను కాపాడాలంటూ తల్లి రోదించడంతో, పక్క ఇళ్లవారు అక్కడకు చేరుకునేలోపే ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. అక్క మంటల్లో కాలిపోగా, చెల్లి దట్టమైన పొగతో ఊపిరిఆడక ప్రాణాలు కోల్పోయింది.

వివరాల్లోకి వెళితే పర్చూరు తూర్పుబజార్ వీధిలో దాసరి వెంకటేశ్వర్లు, లక్ష్మీరాజ్యం దంప తులకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తె నాగమణి అనారోగ్య సమస్యతో మంచంపట్టగా, మరో కుమార్తె ఫిట్స్ కారణంగా అవివాహితులుగా ఉన్నారు. కుమారుడు శ్రీని వాసరావు మానసిక సమస్యతో ఉన్నా లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో కూలీనాలీ చేసుకొని, ప్రభుత్వ పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. భర్త వృద్ధుడు కావడంతో లారీ ఆఫీస్‌లో నైట్ వాచ్ మన్‌గా పనిచేస్తున్నారు. వీరికున్న చిన్న రేకుల షెడ్డు ఇంటిలో అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. అప్పటికి ఇంట్లో తల్లీ కుమా ర్తెలు మాత్రమే ఉన్నారు. ఈ ప్రమాదంలో అక్కా చెల్లెళ్ళు దాసరి నాగమణి(34), చెల్లెలు మాధవీలత(30) మృతి చెందారు. అనారోగ్యంతో మంచంలో ఉన్న నాగమణి సజీవద హనం కాగా మంటలను ఆర్పే ప్రయత్నంలో పొగతో ఊపిరి ఆడక మాధవీలత మృతి చెందింది. తల్లి రాజ్యలక్ష్మికి తీవ్రగాయాల య్యాయి. అగ్ని ప్రమాదం విషయాన్ని తెలు సుకున్న మార్టూరు సీఐ ఎం శేషగిరిరావు హుటాహుటీన సిబ్బందితో కలసి ఘటనా స్థలా నికి చేరుకొని తీవ్రగాయాలతో ఉన్న రాజ్యల క్ష్మిని 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటిలో కాలిపోయి మృతి చెందిన అక్కా చెల్లెళ్ల మృతదేహాలను పోస్టు మార్టు నిమిత్తం పర్చూరు ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. ఈ ఘటనతో పర్చూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన ఇంటిలో రెండు సిలిండర్‌లు ఉన్నాయి. విషయాన్ని చీరాల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో వారు చేరుకో లేదు. ప్రమాదం జరిగిన రెండు గంటల వరకు అగ్ని మాపక సిబ్బంది రాలేదు. అలస్యంగా వచ్చి మంటలను ఆర్పి మమ అనిపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న సిలిండర్‌లు పేలి ఉంటే ప్రమాదం భారీ గానే జరిగిఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, స్థానిక ఇన్‌చార్జి ఎస్సై రత్నకుమారి, ఏఎస్సై సురేష్‌రెడ్డి సిబ్బం దితో కలసి పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. బాపట్ల క్లూస్ టీం సిబ్బంది నమూనాలను సేకరించారు. అదేవి ధంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ టీటీ నాయక్ నేతృత్వంలో సిబ్బంది పరిశీలించి వివ రాలు నమోదు చేశారు.


తీవ్రంగా గాయపడిన దాసరి లక్ష్మీరాజ్యం


ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, ఎస్ఐ రత్నకుమారి

అగ్రవర్ణాల్లోని పేదలకూ సబ్సిడీ రుణాలు

బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు

జిల్లాకు 568 యూనిట్లు కేటాయింపు

8 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు నగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల తరహాలోనే అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను ఇవ్వనుంది. వారు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేందుకు అవకాశం కల్పించింది. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలను మంజూరు చేయనుంది. 50శాతం సబ్సిడీ ప్రకటించింది. జిల్లాకు మొత్తం 568 యూనిట్లను కేటాయించింది. వీటిలో స్వయం ఉపాధి యూనిట్లు 483, జనరిక్ మందుల దుకాణాలు 85 ఉన్నాయి. జనరిక్ మందుల దుకాణాలకు యూనిట్ విలువ రూ.8 లక్షలు కాగా ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీ ఉంటుంది. మిగిలిన సొమ్మును లబ్ధిదారుడు బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కులాల వారీగా ఎవరికి ఎన్ని అన్నది కూడా నిర్ణయించింది.

ఈబీసీలకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 16వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందన్నారు. అనంతరం వచ్చిన వాటిని పరిశీలించి, ఇతర అభ్యంతరాలను పూర్తిచేసి ఫిబ్రవరిలో గౌండింగ్ ప్రక్రియను చేపడతామని ఆయన తెలిపారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు

మార్కాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామచెరువును ఆక్రమించి అక్రమంగా ఏర్పాటు చేసిన ఇటుకల బట్టీలను సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవిలు, రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం తొలగించారు. రాయవరం గ్రామ చెరువు 203 సర్వే నెంబర్‌లో 62 ఎకరాలలో ఉంది. అందులో సుమారు 20 ఎకరాలను గ్రామ వైసీపీ నాయకులు ఆక్రమించి మూడు ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. యథేచ్ఛగా అక్కడే వ్యాపారాలు చేస్తున్నారు. గ్రామసమీపంలో నివాస ప్రాంతాలలో ఇటుకల బట్టీలు నిర్వహించకూడదని తెలిసినా గత ప్రభుత్వంలో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారు. వైసీపీ నాయకుల అండతో చెరువును ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి పరిశీలించి ఎక్స్‌కవేటర్ యంత్రంతో ఆక్రమణలను తొలగించారు. పదిహేను రోజుల క్రితమే చెరువు భూమిలో అక్రమంగా ఏర్పాటుచేసిన ఇటుకల బట్టీలను తొలగించారు.

కచ్చితమైన సమాచారం కావాలి

ఎస్సీ ఉపకులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఒంగోలునగరం, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లోని ఉపకులాలకు చెందిన ఖచ్చితమైన సమాచారం అందించాలని ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఆయన సోమవారం ఉదయం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై గణాంకాలతో సమగ్రంగా వివరాలను అందజేయాలని కోరారు. రాజకీయంగా కూడా ఎస్సీల స్థితిగతులను కమిషన్ పరిశీలన చేస్తుందన్నారు. ఎస్సీల లబ్ధిదారుల్లో ఉప వర్గాలను కూడా పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా స్థాయిలో ఎస్సీల్లోని 59 ఉప కులాల పరిస్థితులపై అధ్యయనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలు, కేడర్, ఉపకులాల వారీగా ఖచ్చితమైన సమాచారం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పూర్వపు ప్రకాశం జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉండగా ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ బాపట్ల జిల్లాలో 13 మండలాలు, నెల్లూరు జిల్లాలో ఐదు మండలాలు కలిపారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 38 మండలాలు ఉన్నాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పూర్వపు జిల్లాలో 33,97,448 మంది జనాభా ఉండగా ఇందులో ఎస్సీ జనాభా మొత్తం 7,87,861 మంది ఉన్నారని వివరించారు. అందులో పురుషులు 3,97,861 మంది, స్త్రీలు 3,90,619 మంది ఉన్నారన్నారు. ఎస్సీ అక్షరాస్యత జనాభా మొత్తం 4,10,946 కాగా అందులో పురుషులు 2,40,551 మంది, స్త్రీలు 1,70,395 మంది ఉన్నారని తెలిపారు. ఎస్సీల అక్షరాస్యత శాతం 59.75 ఉండగా అందులో పురుషుల శాతం 69,50 కాగా స్త్రీల శాతం 49.86గా ఉందన్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల్లో కలిపి ఉద్యోగులు 36,669 మంది ఉన్నారని, అందులో మాలలు 21,789 మంది, మాదిగలు 14,770 మంది, ఇతర ఉపకులాలు వారు 160మంది ఉన్నారని వివరించారు.

ఇసుక దందా, అనధికారిక లేఅవుట్లను ఉపేక్షిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, అనధికారిక లేఅవుట్లపై ఉపేక్షిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లకు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరం ప్రాంగణంలో సోమవారం వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లు, ఇసుక దందాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లదేనన్నారు. విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ఈ దందాలను అరికట్టకుండా, ఉన్నతాధికారులకు తెలపకుండా వ్యవహరిస్తే అది ఉద్దేశపూర్వక తప్పుగా భావించి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రభుత్వ భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వ ఆస్తి ఎక్కడా పరాధీనం కాకూడదని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలలో భారత్ సత్తా చాటాలి

అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య

ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగో ఆవిష్కరణ

పంగులూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలలో భారత్‌జట్లు సత్తా చాటి విజేతగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బీసీహెచ్ గరటయ్య ఆకాంక్షించారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ అకాడమీలో ఢిల్లీ కేంద్రంగా నిర్వహించబోతున్న ప్రపంచ కప్ ఖోఖో పోటీల లోగోను సోమవారం డాక్టర్ గరటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంగులూరులో ఖోఖో క్రీడకు ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. మూడున్నర దశాబ్దాలుగా పంగులూరు కేంద్రంగా ఖోఖో క్రీడకు లభించిన ఆదరణ, స్థానికంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. ఖోఖో అన్ని క్రీడలకూ తల్లి వంటిదన్నారు. ఖోఖో క్రీడాకారులను తీర్చి దిద్దడంలో పంగులూరు ఓ ఖార్ఖానాగా పేరు గడించిదని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వందలాది మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించగా, పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని పతకాలను సాధించారని గుర్తుచేశారు. క్రీడల్లో రాణించిన ఎందరికో ఉపాధి చూపిన ఖోఖో కనిగిరి, ఈదర ప్రాంతాలలో విస్తరించేందుకు దోహద పడిందన్నారు. ఈ సందర్భంగా ఖోఖో లోగోతో పలువురు క్రీడాకారులు, పాఠశాల విద్యార్థులు గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, కోచ్ డీఎల్ రెడ్డి, రోటరీ ప్రతినిధులు రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, చిలుకూరి వీరరాఘవయ్య, హెచ్ఎం రమాదేవి, నేతలు జాగర్లమూడి సుబ్బారావు, రావూరి శ్రీనివాసరావు, ఐ.సుబ్బారావు పాల్గొన్నారు.



ఖోఖో పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ గరటయ్య, సీతారామిరెడ్డి

సంక్రాంతి సంప్రదాయాలు కనుమరుగు

గ్రామాలలో పెరిగిన క్రికెట్, షటిల్ పోటీలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే గ్రామాలలో పండుగదనం ఉట్టిపడేలా సందడిగా ఉండేది. అయితే క్రమేపీ నాటి సంక్రాంతి సంబరాలు కనుమరుగు అవుతూ వస్తున్నాయి. గంగిరెద్దుల ఆటలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. గాలిపటాల రెపరెపలు మచ్చుకు కూడా లేవు. ఇక పశుసంపదకు పూజలు అసలే లేవు. బతుకుదెరువు కోసం కొందరు గంగిరెద్దుల వలే ఆవులను సింగారించి వీధుల్లో తిప్పుతూ పొట్ట పోసుకుంటున్నారు. ఇక ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు అక్కడక్కడా తళుక్కున మెరుస్తున్నాయి. పేడతో పెట్టే గొబ్బిమ్మల జాడే లేదు. అంతేగాక హరిదాసుల కీర్తనలతో గ్రామాలు ప్రతిధ్వనించేవి. నేడు వారు రాక కూడా తగ్గింది.

నాటి సంక్రాంతి సంబరాల స్థానంలో ప్రస్తుతం గ్రామాలలో సైతం క్రికెట్, షటిల్ పోటీలను నిర్వహిస్తున్నారు. గ్రామాలలో సైతం యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఇతర ప్రాంతాలలో స్థిరపడగా సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. అదే సమయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాల పేరుతో కలిసి చదువుకున్న వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.



అద్దంకి నియోజకవర్గంలో సంక్రాంతి మరింత సందడిగా ఉంటుంది. కొరిశపాడు మండలంలోని రావినూతలలో మూడు దశాబ్దాలుగా అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి క్రికెట్ టీమ్‌లు పాల్గొంటాయి. ఇదే బాటలో పంగులూరు మండలం కొండమంజులూరులో కూడా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్నారు. ఇక జిల్లా స్థాయి, రెండు, మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లను బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాలలో కూడా ఏటా నిర్వహిస్తున్నారు. ఇలా సంక్రాంతి సంప్రదాయం కాస్తా క్రికెట్ టోర్నమెంట్ వైపు మళ్లింది.



గ్రామాల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వస్తుండడంతో సందడిగా మారుతున్నాయి. ఈ క్రమంలో నాడు చిన్నతనంలో కలిసి చదువుకున్న మిత్రులందరూ కలిసేందుకు ఉత్సాహం చూపుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సన్మానిస్తున్నారు. అలాగే పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. సంప్రదాయంగా చేసే సంక్రాంతి పండుగ క్రమక్రమంగా రూపం మార్చుకుని ఆధునికత వైపు నడుస్తోంది. అయినప్పటికీ ఇంకా కొన్నికొన్ని ఊళ్లలో అచ్చమైన సంక్రాంతి పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తుండడం గమనార్హం.

ఉపాధి సిబ్బందిపై కొరడా

అవినీతికి పాల్పడినవారిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు

రిజిస్టరు పోస్టు ద్వారా కార్యాలయానికి ..

పూర్వ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు

పీసీపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడిని ఉద్యోగులపై వేటు పడింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు అవినీతికి పాల్పడిన ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వులు రిజిస్టరు పోస్టు ద్వారా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చాయి. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 549 పనులకు 11.95 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు సంబంధించి 22పనులకు 1.25కోట్లు మొత్తం 12.26కోట్లు ఖర్చుచేశారు. ఈ పనులకు సంబంధించి సెప్టెంబరులో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మండలంలో చేపట్టిన ఉపాధి పనులలో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.సామాజిక తనిఖీ అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆడిట్ బృందం అధికారుల ఎదుట నివేదికలను వెల్లడించారు. మండలంలో 328పనులకు సంబంధించి రూ.61.77లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ అక్రమాలలో ఏపీవో సుబ్బారావు, కంప్యూటర్ ఆపరేటర్ షరీఫ్, టీఏలు వీరాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వై.శేఖర్ కిషోర్, వెంకటేశ్వర్లుతో పాటు ఈసీ సత్యనారాయణను బాధ్యులను చేస్తూ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించడంతోపాటు నేరుగా తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని పీడీ జోసెఫ్‌కుమార్ నోటీసులు పంపించారు. ఎంపీడీవో కార్యాలయానికి పోస్టు ద్వారా వచ్చిన ఈ నోటీసులను సస్పెండ్ అయిన ఉద్యోగులు అందుకున్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగిన సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేసిన 18మందికి వారిపై నమోదైన అభియోగాలకు వివరణ ఇవ్వడంతో పాటు రికవరీ చెల్లించాలని షోకాజ్ నోటీసులు జారీచేశారు.

శీనారెడ్డి అక్రమాలపై ఇంటెలిజెన్స్ దృష్టి

పలువురి నుంచి వివరాలు సేకరణ

ఇప్పటికే కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ

తాజాగా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కీలకమైన మరో విభాగం దృష్టి సారించింది. ఇప్పటికే ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై తొలుత విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టగా తర్వాత కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు అధికారుల కమిటీ విచారణ నిర్వహిస్తోంది. దాదాపు పక్షం రోజులుగా ఇది కొనసాగుతుండగా అనేక అక్రమాలు, అవినీతి వ్యవహారాలు వెలుగు చూస్తున్నాయి. ఇందుకు సంబంధించి వరుస కథనాలు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వంలో కీలకంగా పనిచేసే ఇంటెలిజెన్స్ (గూఢచార) విభాగం అధికారులు దృష్టి సారించారు. విభిన్న అంశాలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తగు సమాచారం ఇచ్చే కీలకమైనది ఐబీ విభాగం కాగా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు శీనారెడ్డి వ్యవహారంపై దృష్టిసారించారు. రెండు, మూడు రోజులుగా శీనారెడ్డి పీడీగా పనిచేసిన కాలంలో ఏం జరిగింది, ఏఏ అంశాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయి, ప్రస్తుతం అధికారుల విచారణ ఎలా జరుగుతుందని ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం కొందరు కీలక వ్యక్తులను కలిసి వివరాలు సేకరించారు. అలాగే ఇప్పటికే అధికారవర్గాల నుంచి కూడా వారు కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది.

పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

శీనారెడ్డి అక్రమాలపై విచారణ కోరుతూ పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ ప్రభుత్వ పెద్దల నుంచి అధికారుల వరకు పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తాజాగా డ్వామాను పర్యవేక్షించే రాష్ట్రస్థాయి అత్యున్నత అధికారైన గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను కూడా కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు. ఒంగోలులో సోమవారం జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణకు కమిషనర్ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆయనన్ను మోహన్ కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో తాను చేసిన ఫిర్యాదు కాపీలు, మీడియాలో వచ్చిన కథనాలు ప్రస్తుతం జరుగుతున్న అధికారుల విచారణలో వెలుగుచూస్తున్న అంశాలను వివరించారు. మరింత లోతుగా విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ అన్ని అంశాలను విని నిర్దిష్ట చర్యలకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలాఉండగా లోకేశ్వరరావు కమిటీ తమ విచారణలో భాగంగా ఈనెల 8,9 తేదీల్లో శీనారెడ్డిపై ఫిర్యాదులు చేసిన, అలాగే ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన డ్వామా ఉద్యోగులను విచారించనుంది. ఈనెల 8న ఐదుగురు ఫిర్యాదుదారులను, 9వతేదీన 31 మంది డ్వామా ఉద్యోగులను విచారణ చేయనుంది. ఆ మేరకు హాజరుకావాలని వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీచేశారు.

జీసీటీఏ జిల్లా కార్యదర్శిగా ప్రసాద్

అవీఇవీ



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) బాపట్ల జిల్లా యూనిట్‌కు జరిగిన ఎన్నికలలో కార్యదర్శిగా కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ వీ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన అధ్యాపకులు, సిబ్బంది జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాద్‌ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

21 మంది ఉద్యోగాలకు ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

మార్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వివిధ కంపెనీలు నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అన్నారు. సోమవారం మార్టూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 44 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 21 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీ ప్రణయ్ అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ఆంజనేయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, ఈఎస్‌సీ కోఆర్డినేటర్ నేతరు శ్రీకాంత్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్ పాల్గొనగా ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్, టాటా క్యాపిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిమట రహదారిలో కూలిన కల్వర్టు



వంతెన కూలిపోవడంతో కూరుకుపోయిన కట్టెల ట్రాక్టర్

మర్రిపూడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జువ్విగుంట-చిమట రహదారిలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు కూలిపోయింది. కొంత కాలంగా ఇది శిథిలావస్థలో ఉంది. ఏక్షణంలోనైనా కూలుతుందని గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం కట్టెల లోడుతో ఉన్న ట్రాక్టర్ కల్వర్టు మీదకు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రాక్టర్ ముందు భాగం కల్వర్టు గోతిలో ఇరుక్కుపోయింది. దీంతో ఆ దారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

దివ్యాంగ పింఛన్‌లపై విచారణ



లబ్ధిదారుడిని విచారిస్తున్న ఎంపీడీవో, డాక్టర్లు

కొండపి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కొండపిలో ఆరోగ్య పింఛన్‌లు అందుకుంటున్న 11 మందిని అధికారుల బృందం విచారించింది. మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని పరిశీలించింది. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులుతోపాటు ముగ్గురు ప్రభుత్వ డాక్టర్ల బృందం, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, కొండపి పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య పాల్గొన్నారు.

ఆరునెలల్లో గ్రామాల్లో మార్పు రావాలి

ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిచేయాలి

తర్వాత పనితీరు ఆధారంగానే కొనసాగింపు

ఉపాధి పనులపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలి

పొలాల్లో నీటి కుంటలు, చెరువుల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

కూలీలకు కనీస వేతనం రూ.300 రావాల్సిందే

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణతేజ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ఆరు నెలల్లో గ్రామాల్లో మార్పులు రావాలని, లేదంటే క్షేత్రస్థాయి సహాయకులను తొలగిస్తామని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ స్పష్టంచేశారు. స్థానిక ఓ కన్వెన్షన్ హాలులో సోమవారం క్షేత్రస్థాయి సహాయకులు, సీనియర్ మస్టర్ల శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కూలీలకు కనీస వేతనం రూ.220 మాత్రమే వస్తుండటంతో ముందుగా ఇక్కడ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. ఉపాధి ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలన్నారు. ఆ ఫలితాల్లో ఆరు నెలల్లో కనిపించే విధంగా ఉండాలన్నారు. ప్రధానంగా ప్రస్తుత సీజన్ ఉపాధి పనులకు అనుకూలమైందన్నారు. అందువల్ల రైతుల భూముల్లో నీటికుంటలతోపాటు పంచాయతీలో ఒక చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరుతున్నప్పుడు వారే ముందుకు వచ్చి నీటికుంటల పనులు చేపట్టాలని మన చుట్టూ తిరిగే విధంగా ఉండాలన్నారు. అది మీ పనితీరు మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు ఆరు నెలల్లో పనితీరు మెరుగుపడకపోతే ఆ తర్వాత కొనసాగించాలా? లేదా? అనేది నిర్ణయం తీసుకుంటామన్నారు. కూలీలకు వేతనంలో కూడా జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడి ఉందన్నారు. కూలీలకు తప్పనిసరిగా రోజుకు రూ.300 వేతనం ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. ఆ దిశగా ఎఫ్ఏలు పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. అదనపు కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా చేపట్టాల్సిన పనులను పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ముందుకుపోవాలన్నారు.

తెగుళ్లతో మిర్చి రైతుల బెంబేలు

» దెబ్బతింటున్న పైర్లు » పంటలను కాపాడుకునేందుకు అవస్థలు



నూతలపాడులో సాగులో ఉన్న మిర్చి



మందును పిచికారీ చేస్తున్న రైతు

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులను పలు రకాల తెగుళ్ల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పైర్లు పచ్చగా ఉండి పూత పిందె దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్లు సోకి పాడు చేస్తున్నాయి. తెగుళ్ల నుంచి పైర్లను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికి అందివచ్చిన పంట తెగుళ్లబారినపడుతుండడంతో ఏమి చేయాలో అని తలలు పట్టుకుంటున్నారు. బొబ్బర, నల్లి తెగుళ్ల బాధ వెంటాడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కౌలు, వ్యవసాయ పెట్టుబడులు కలుపుకొని రూ.లక్ష వరకు ఖర్చు అయిందని, పైర్లను చూస్తుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనపడడం లేదని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో దాదాపు 15 వేల ఎకరాలకు పైగానే రైతులు మిర్చి పైరును సాగు చేస్తున్నారు. గత ఏడాది మిర్చి ధర దిగజారడం, పెట్టుబడులు అధికంగా ఉండడంతో ఈ ఏడాది సాగును తగ్గించారు. అయితే ఈ ఏడాది అయినా ధర ఆశాజనకంగా ఉంటుందన్న ఆశతో వ్యవప్రయాశలు పడి సాగు చేసిన రైతులకు తెగుళ్ల దాడి చేస్తున్నాయి. తెగుళ్ల తీవ్రతతో ఇప్పటికే వందల ఎకరాల్లో పైర్లు తొలగించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే గులాబీ తెగులుతో తెల్లబంగారం (పత్తి) నష్ట పోయినట్లుగానే మిర్చి రైతులూ నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు



వేలకు వేలు పెట్టుబడులు పెట్టి మిర్చిని సాగు చేస్తున్నాను. తెగుళ్ల దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం నల్లి తెగులు ఉధృతంగా ఉంది. పైర్లు నిలువునా దెబ్బతింటున్నాయి. ఎన్ని క్రిమిసంహారక మందులు చల్లినా ఫలితం కన్పించడం లేదు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

- జీ.రమణమ్మ మహిళా రైతు, నూతలపాడు

నీరు అందుబాటులో ఉందని సాగు చేశాం



గత ఏడాది ఆరుతడులకు నీరు లేకపోవడంతో సాగు చేసుకున్న పైర్లను కాపాడుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది నీరు అందుబాటులో ఉండడంతో వ్యయ ప్రయాసలు పడి ఉన్న కొద్దిభూమితోపాటు, మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చిని సాగుచేశాను. పైర్లు ఆశాజనకంగా ఉన్న తరుణంలో తెగులు సోకింది.

- గన్నవరపు సాంబయ్య, నూతలపాడు



సొన స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలలోని నాయిని పల్లి పంచాయతీ పరిధిలో సొన భూమిని కొందరు ఆక్రమించగా, వారిని తొలగించి సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా కఠిన తప్పవని స్పష్టం చేశారు.

మద్యం దుకాణదారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలా.. బార్‌లా..? అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై చీరాల మండలం ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, కారంచేడు ఎస్సై వెంకట్రావు స్పందించారు. తమ, తమ పరిధుల్లోని మద్యం దుకాణాలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్‌ల మాదిరిగా మద్యం తాగేందుకు వసతులు కల్పించేందుకు వారికున్న అనుమతులు ఏమిటో తెలపాలని ఆ నోటీసులలో పేర్కొన్నట్లు ఈపురుపాలెం, వేటపాలెం, కారంచేడు ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు,వెంకట్రావు తెలిపారు. దీంతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారికి కూడా అనధికారిక పర్మిట్ రూమ్‌లతో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ ఏర్పడుతోందన్న విషయాన్ని చెపుతామన్నారు. ఇప్పటికే సంబంధీకులకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనల మేరకు మాత్రమే వారివారి విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులను తాము ఏ మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

అద్దంకి పట్టణంలో 31,631 మంది ఓటర్లు

మహిళలే అధికం



అద్దంకి పట్టణ ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్న అధికారులు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణ ఓటర్లు 31,631 మందికి చేరారు. పోలింగ్ బూతులవారీగా ఓటర్ల జాబితాను సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ప్రకటించారు. అద్దంకి పట్టణంలో మొత్తం 31 పోలింగ్ బూత్‌లు ఉండగా పురుష ఓటర్లు 15,155 మంది, మహిళా ఓటర్లు 16,470 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 6 గురు ఉన్నారు. ఓటర్ల జాబితా సమాచారాన్ని కార్యాలయం పనివేళలలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, టీపీఎస్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో ఉన్న తప్పులను సవరించాలి

మార్టూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో నమోదైన తప్పులను సవరించాలని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్‌తోపాటు రైతు సంఘం ప్రతినిధులు తహసీల్దార్ టీ ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. సోమవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సర్పంచ్ సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా, హాజరయిన తహసీల్దారు ప్రశాంతితో రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడారు. గ్రామంలోని శివాలయంలోని సర్వే నెంబర్ 208లో దేవాలయానికి 20 సెంట్లు కేటాయిస్తే మిగిలిన భూమి కూడా దేవదాయశాఖకు చెందిన భూమిగా రీసర్వేలో నమోదు చేశారన్నారు. తద్వారా వాటి భూములలోని రైతులు కొనుగోలు, అమ్మకాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా గ్రామ కంఠం భూమి ప్రభుత్వ భూమిగా ప్రకటించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపుగా 90 శాతం తప్పులు రీసర్వేలో జరిగాయని వాటిని వెంటనే సవరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు,తాటి నాగార్జున, కందిమళ్ల రామకోటేశ్వరరావు, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో వీరయ్య, సర్వేయరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా లక్ష్మీనారాయణ

యద్దనపూడి (మార్టూరు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పీ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఎస్ఎం అకీబ్ జావెద్ వ్యక్తిగత పనులు నిమిత్తం ఈ నెల 1 నుంచి 28వతేదీ వరకు సెలవుపై వెళ్లారు. దీంతో జడ్పీ కార్యాలయం నుంచి లక్ష్మీనారాయణను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో సకాలంలో వైద్యం

ఎమ్మెల్యే కొండయ్య



సీఎం రిలీఫ్ ఫండ్ సాయం పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మందికి సకాలంలో వైద్యం అందుతోందని, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని 16 మందికి రూ.20,89,377 చెక్కులను ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు. థామస్‌పేటకు చెందిన మల్లెపోగు అనిత కుమారికి రూ.86,814, గొల్లపాలెంకు చెందిన చుక్కా కృష్ణకు రూ.1,77,790, ఈపురుపాలెంకు చెందిన ఎన్.శ్రీలేఖకు రూ.2,33,962, వాడరేవుకు చెందిన యాకోబుకు రూ.60వేలు, ఈపురుపాలెంకు చెందిన కుమార్‌రాజాకు రూ.40వేలు, షేక్ బుడేకు రూ.17,101, పి.హాసినికి రూ.26,218, కె.అశ్వినికి రూ.30వేలు, సీహెచ్ ఏడుకొండలకు రూ.49,258లు, మణికంఠకు రూ.31,377, అభినవ్‌కు రూ.2,50,000, పాపరాజుతోటకు చెందిన సాంబశివరావుకు రూ.40,166, వేటపాలెంకు చెందిన యానాదిరావుకు రూ.3,03,678, రామకృష్ణాపురానికి చెందిన బాలచంద్రశేఖర్‌కు రూ.1,20,550, దేవాంగపురికి చెందిన జితేంద్రకుమార్‌కు రూ.1,20,283, పాతచీరాలకు చెందిన కె.భవిష్‌రెడ్డికి రూ.5లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పత్రాలను డిప్యూటీ ఈవోకు అందజేస్తున్న పాఠశాల కమిటీ ప్రతినిధులు

కారంచేడు ఎయిడెడ్ పాఠశాల ప్రభుత్వానికి అప్పగింత

డిప్యూటీ ఈవోకి పత్రాలను అందజేసిన కమిటీ ప్రతినిధులు

కారంచేడు(పర్చూరు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ఎయిడెడ్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ మేరకు సోమవారం కమిటీ ప్రతినిధులు బాపట్ల జిల్లా డిప్యూటీ ఈవో ఎ.శ్రీనివాసరావుకు పాఠశాలను అప్పగిస్తూ పత్రాలను సమర్పించారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ లగడపాటి రాజ్యలక్ష్మి, మధుసూదనరావు అభీష్టం మేరకు యార్లగడ్డ రఘుబాబు చేతుల మీదుగా పాఠశాలకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సం నుంచి ఈపాఠశాల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారు ఎంపీవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, స్టిబంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

చెత్త సేకరణతో ఆదాయం పొందాలి

పంగులూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రమైన పంగులూరులోని చెత్త సంపద కేంద్రాన్ని సోమవారం స్వరూపారాణి పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి కంపోస్టును తయారు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

ధేనువకొండలో చోరీ కేసు నమోదు

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధేనువకొండలో చోరీ జరిగిన ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. దేనువకొండకు చెందిన బోడపాటి అంజయ్య ఈ నెల 2వ తేదీ రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.35వేలు, 11 గ్రాముల బంగారం అపహరించుకు పోయారు. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

అద్దంకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి విద్యుత్ సమస్యలపై ప్రజాభి ప్రాయ సేకరణ జరుగుతుందని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం నుంచి 10వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాన్ని అద్దంకిలోని కార్యాలయంలో నుంచి తెలియజేసే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.

ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అద్దంకి డివిజన్ పరిధిలోని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

మంచంపై ఉన్న పింఛన్‌దారుల పరిశీలన



మణికేశ్వరం గ్రామంలో పింఛన్‌దారులను పరీక్షిస్తున్న వైద్య బృందం

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అద్దంకి మండలంలోని పలు గ్రామాలలో కదలేక మంచంపై ఉంటూ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం సోమవారం పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ డాక్టర్ హరిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణాదినాతో పాటు మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్షతో కూడిన వైద్య బృంద పింఛన్‌దారులను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పింఛన్‌దారుల జాబితా ప్రకారం మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వైద్య బృందం పర్యటించింది. కాళ్లు, చేతుల కదలిక, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వివరాలను నమోదు చేశారు. మంచంపైనే ఉంటూ కదలలేని పింఛన్‌దారులు మండలంలో 31 మంది వరకూ ఉన్నారని, మరో రెండు రోజుల పాటు పరిశీలిస్తామని డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. వారి వెంట ఎంపీహెచ్‌ఈవో ఏ.నాగేశ్వరరావు, జానీ, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలను అందజేస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య, టీడీపీ నేతలు

అగ్ని ప్రమాద బాధితులకు ఏలూరి సాయం

రూ.25వేలు అందజేసిన తహసీల్దార్, టీడీపీ నేతలు

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూ.25వేల నగదును సమకూర్చారు. సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్య స్థానిక నేతలతో కలసి కుటుంబ సభ్యులకు సాయాన్ని ఇచ్చారు. దీంతోపాటు నిత్యావసర సరుకులను కూడా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, టీడీపీ నేతలు ఎం నరేంద్ర, సురేష్, శివనాగేశ్వరరావు, షేక్ గౌస్, వీఆర్వోలు గోవిందరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిశ్రాకు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను సోమవారం అద్దంకి ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు కలిశారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు న్యాయం చేయాలని, వర్గీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ అద్దంకి నియోజకవర్గం అధ్యక్షుడు అనపర్తి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి గంగవరపు సిద్దు, ట్రెజరర్ మున్నంగి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు మల్లవరపు దాసు, చెన్నయ్య, అంకయ్య, నరేష్, ఉదయ్, బుజ్జిబాబు ఉన్నారు.

సంతమాగులూరు : మండలంలోని పాత మాగులూరు ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన కులగణనలో ఎస్సీ మాదిగ అని మాత్రమే నమోదు చేసి జాతీయతా కాలమును ఖాళీగా వదిలి వేశారని దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు సోమవారం ఎస్సీ కాలనీకి పరిశీలనకు వచ్చిన సోషల్ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూ స్వరూపకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో 400 కుటుంబాలు ఎస్సీలు నివసిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం స్వరూప మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో కుల గణనకు సంబంధించి లిస్టులు డిస్ ప్లే చేసి ఉన్నాయన్నారు. బాధితులు తమ తమ కులగణనని సరి చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మిరియాల శేషుబాబు, వీఆర్వో రాధిక, ఎస్సీ హాస్టల్ వార్డెన్ మున్నంగి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకొని లక్ష్యాలు సాధించాలి



గురుకుల విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సాయాన్ని వినియోగించుకొని క్రమశిక్షణతో చదువుకొని లక్ష్యాలను సాధించాలని విద్వాన్ జ్యోతిచంద్రమౌళి అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. రోటరీ కోశాధికారి మలాది శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, తాళ్లూరి బాబూరావు, ప్రిన్సిపాల్ పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

మృతుడి అనకాపల్లి వాసి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో అనకాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈఘటన సీఈసీ కళాశాల సమీపంలోని రామాపురం రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం ఆర్ భీమవరానికి చెందిన కోడూరు వెంకటరావు (35) రామాపురానికి చెందిన జయరాణిను సుమారు పదేళ్ల క్రితం వివాహ మాడాడు. ప్రస్తుతం వీరికి ఎనిమిదేళ్ల పాప ఉంది. వెంకటరావు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో నెలకొన్న వివాదాలు కారణంగా మనస్తాపం చెందిన అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన




మరుగుదొడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అసిస్ట్, యూఎల్‌టీసీ ప్రతినిధులతో టీడీపీ నాయకులు

యద్దనపూడి (మార్టూరు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం, వింజనంపాడు, సూరవరపు పల్లి గ్రామాలలో యూఎల్‌టీసీ కంపెనీ వారి ఆర్థిక సహకారంతో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటిని చిలకలూరిపేటలోని అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాన్ని పూర్తిచేస్తారు. మొదటిగా అనంతవరం గ్రామంలో ఎస్టీ కాలనీలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు జీ భరత్‌రెడ్డి, నరసరాజు మాట్లాడుతూ మూడు గ్రామాలలో కులాలు, మతాలతో సంబంధం లేకుండా గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి అవసరమైన వారికి మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్ ఎం.విష్ణుప్రియ, కోఆర్డినేటర్ కే డేవిడ్, టీడీపీ గ్రామ నాయకులు గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని విజయవంతం చేయాలి

పాములూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొల్లా మాల్యాద్రిచౌదరి జ్ఞాపకార్థం మండలంలోని గుమ్మలంపాడులో ఈనెల 9 నుంచి నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న జీఎంపీ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు.



మా భూమిని ఆక్రమించారు!



నాతోపాటు మా బంధువులకు అల్లంపాడు రెవెన్యూలోని సర్వే నెం.511లో ఒక్కొక్కరికి ఒక ఎకరా చొప్పున 2003లో ఇచ్చారు. ఇప్పుడా భూమిని వేరే వారు ఆక్రమించుకున్నారు. మాకు అప్పగించమని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులంతా రాజకీయన నాయకులే కావడంతో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.

- సయ్యద్ బీసాబీ, మర్రిపాడు

ఇబ్బంది పెడుతున్నారు!



మాకు ప్రభుత్వం సెంటు భూమి కూడా ఇవ్వలేదు. కదిరినేనిపల్లి రెవెన్యూలో సర్వే నెం.1లో 2ఎకరాల భూమిని చదును చేసుకొని ఇటీవల జామాయిల్ మొక్కలు నాటుకున్నాను. మా పక్క గ్రామాల నేతలు కొందరు వచ్చి ఆ మొక్కలను పెరికేశారు. సర్వే నెం.1లో మొత్తం 803.86 ఎకరాలు మేతపోరంబోకు భూమి ఉన్నందున ఆ మొత్తాన్ని ఇద్దరు ముగ్గురు కలిసి ఆక్రమించుకునేందుకు నన్ను ఇబ్బంది పెడుతున్నారు.

- నూతలపాటి శ్రీనయ్య, కదిరినేనిపల్లి

రాజకీయ నేతల అండ... అధికారుల ఉదాసీనత వైఖరి ఇంకేం ఈ రెండూ అక్రమార్కులకు కలిసి వచ్చాయి. అత్యధికంగా ప్రభుత్వ భూములు ఉన్న మర్రిపాడుపై కబ్జారాయుళ్ల కళ్లు పడ్డాయి. రాత్రిపూట, సెలవు దినాల్లో సదరు భూములను చదును చేయించి జామాయిల్, పొగాకు, మినుము వంటి పంటలు సాగు చేసుకుంటూ తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.





అడ్డగోలుగా..!

- మర్రిపాడులో పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు
- రాత్రికి రాత్రే ప్రభుత్వ భూముల చదును
- పట్టీపట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం
- కబ్జాకోరులకు రాజకీయ అండ

మర్రిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 రెవెన్యూ గ్రామాలలో 22,432.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 15,123 ఎకరాలను ఆరు విడతలుగా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. మిగిలిన 7309.19 ఎకరాలు మాత్రం అధికారుల లెక్కల ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉంది. మండలం మీదుగా నాలుగు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండటం, జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో ఈ ప్రాంతంపై ఆక్రమణదారుల కళ్లుపడ్డాయి. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తించి హస్తగతం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా హైవేకు సమీపాన అయితే రూ.8లక్షలు ఉండగా, కొంచెం దూరంగా ఉన్న భూమి అయితే రూ.2 లక్షల వరకు పలుకుతోంది. రోజు రోజుకు భూముల ధర పెరిగిపోతుండటంతో కొందరు రాత్రికిరాత్రే ప్రభుత్వ భూముల్లో కంప చెట్లు తొలగించి ముమ్మరంగా చదును చేస్తున్నారు. అనాదీనం, వాగు పోరంబోకు మేత పోరంబోకు అనే తేడా లేకుండా ఆక్రమణకు పాల్పడుతున్నారు.

ఒక్కొక్కరు పది నుంచి ఇరవై ఎకరాల వరకు ఆక్రమించేసి తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. ఎప్పటికైనా తమ కుటుంబ సభ్యులకే చెందుతాయనే ఆలోచనతో సదరు భూముల్లో ఏదో ఒక పంటను సాగు చేస్తున్నారు. అధికారులు మారిన ప్రతిసారి తమ భూమిని ఆక్రమించారంటూ ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, గ్రీవెన్స్‌డేలలో అర్జీలు ఇస్తున్నారు. అంతేగాక పోలీస్ స్టేషన్ల వరకూ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్న అధికారులు ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినా అక్రమార్కులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. బోర్డులను సైతం పడేసి తమ పని పూర్తి చేస్తున్నారు. ఇర్లపాడు రెవెన్యూలో ఒకే వ్యక్తి సుమారు 70ఎకరాల పైనే ఆక్రమించుకున్నాడు. ఆ భూమిలో బోరు వేయించి వ్యవసాయానికి అనుకూలంగా విద్యుత్ కనెక్షన్ కూడా తీయించుకున్నాడు. అలాగే కడప జిల్లా బద్వేలు సమీపంలో ఇటీవల సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పడటంతో అక్కడ



అల్లంపాడులోని ప్రభుత్వ భూమిలో పొగాకు సాగు చేస్తున్న అక్రమార్కులు

జామాయిల్ ధరలు కూడా క్వింటం రూ.5వేలు పలుకుతోంది. ఆ పరిశ్రమ ద్వారా ఉచితంగా జామాయిల్ మొక్కలు సరఫరా చేస్తుండటంతో భూ ఆక్రమణదారులకు ఖర్చు కూడా కలిసి వస్తోంది. గతంలో ప్రభుత్వం ద్వారా భూమిని పొంది కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక లేదా అప్పుడే తమ భూములకు హద్దులు చూపక ఆ పొలంలోకి వారు వెళ్లలేదు. తీరా సర్వే చేయించుకున్నాక ఆ పొలం ఆక్రమణకు గురైందని తెలిసి ఆక్రమణదారుడిని భూమి నుంచి బయటకు పంపలేని పరిస్థితుల్లో బాధితులు కుమిలిపోతున్నారు. మొన్నటివరకు సుమారు 2వేల ఎకరాలు ఆక్రమణకు గురైవుండగా, ఇటీవల అనంతరం చాబోలు 100, బ్రాహ్మణపల్లి 100, పెగళ్లపాడు 100, కదిరినేనిపల్లి 150, ఇర్లపాడు 150, అల్లంపాడు 100, పల్లవోలు 100 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. పొంగూరు, చుంచులూరు, ఇర్లపాడు రెవెన్యూలలో పాత భూ తగాదాలే కొనసాగుతున్నాయి. ఇటు అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం అటు రాజకీయ నాయకుల అండ ఉండటంతో కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరాధీనం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తే
ఎవరినీ ఉపేక్షించం!

- అక్రమ రవాణా నిరోధానికి నిఘా ముమ్మరం
- టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్



అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాస్

రాపూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక నిఘా విభాగం (టాస్క్‌ఫోర్స్) ఎస్పీ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం పెంచలకోనలో ఉన్న సీటీఈటీ ఫారెస్ట్ కమ్యూనిటీ పార్కులో రాపూరు రేంజ్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఎర్రచందనం చెట్ల నరకడం, లోడింగ్, రవాణా జరిగే ప్రాంతాల వివరాలు సేకరించి, అక్కడ నిఘాను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. అలాగే, స్మగ్లింగ్ వెనక స్థానికంగా ఎవరున్నా, రాజకీయ నేతలు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఎర్రచందన కూలీలు, పాత నేరస్థులపైనా ఓ కన్నేసి ఉంటామని చెప్పారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు బాలిరెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, ఏపీఎఫ్ జె.శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ ఎం.మురళీకృష్ణ, ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కె.కృపానంద్, ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్; రాపూరు రేంజ్ ఆఫీసర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

వైద్యులు రారు.. రోగులను చూడరు!

కావలిలో పేరుకే ఏరియా వైద్యశాల

- వివరాలు 8లో..



జిల్లా ఓటర్లు 19,44,664

నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొత్తం ఓటర్లుగా 19,44,664 మంది నమోదయ్యారు. అందులో పురుష ఓటర్లు 9,50,600, మహిళా ఓటర్లు 9,93,283 మంది ఉన్నారు. థర్డ్ జండర్లు 210, సర్వీసు ఓటర్లు 571 మందిగా రికార్డయ్యారు. ఈ మేరకు జిల్లాలోని ఓటర్ల ముసాయిదా తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. రాష్ట్రంలో విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం జిల్లాల తర్వాత అత్యధిక ఓటర్లు ఉన్న జిల్లాగా నెల్లూరు నిలిచింది. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను గతేడాది నవంబరు, డిసెంబరు నెలలో ఎన్నికల సంఘం చేపట్టింది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఆ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక తుది జాబితాను తాజాగా ప్రచురించింది.

పదవులు కాదు.. ప్రజాసేవే ముఖ్యం!




పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

- నా హయాంలో అభివృద్ధి చేశా!
- నెల్లూరులో మాజీ సీఎం నల్లారి
- కిరణ్‌ను కలిసి మంత్రి ఆనం
- గోదావరి, కృష్ణా జలాలు, సాగునీటి విషయాలపై చర్చ

6

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం 2,194 క్యూసెక్కుల నీరు వస్తుండగా సోమవారం 2,781 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.562 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రికార్డులు సాధించడమే లక్ష్యం



రికార్డులు సాధించడమే లక్ష్యంగా క్యారమ్స్‌లో రాణిస్తున్నాను. వరసగా మూడుసార్లు రికార్డులు సాధించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును కూడా సొంతం చేసుకున్నాను. 2014లో సబ్‌జూనియర్ విభాగంలో, 2015లో జూనియర్స్ విభాగంలో, 2016లో గిన్నిస్‌బుక్ రికార్డ్‌లో శాశ్వత పేరు నమోదు చేసుకున్నాను. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 51 బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించడంతో 2017లో కాలిఫోర్నియాలోని బర్కిలీ యూనివర్సిటీ స్పోర్ట్స్‌లో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఏడు జాతీయ పోటీల్లో, మూడు సౌత్‌జోన్ పోటీల్లో సత్తా చాటిన నేను ప్రపంచ చాంపియన్‌గా నిలవడమే ధ్యేయంగా గెలిచేలా సాధన చేస్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారంతో ముందుకు సాగుతున్నాను.

- డాక్టర్ ఎస్‌కే హుస్నా సమీర, గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత

స్ట్రైకరొస్తే బోర్డు కొట్టేస్తా!

ఉత్కంఠగా ఆలిండియా క్యారమ్స్ పోటీలు



స్ట్రైకర్ చేతికొచ్చిన ప్రతిసారీ బోర్డుపై ఉన్న కాయిన్స్ అన్నీ వేసేయాలనే పట్టుదల... ఒక్కొక్క విజయంతో కప్పు గెలవాలనే తపన.. వెరసి నెల్లూరులో జరుగుతున్న ఆలిండియా క్యారమ్స్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ సంస్థల క్రీడాకారులు బరిలో నిలవడంతో ప్రతి ఆట రంజుగా జరుగుతోంది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన వారు కూడా కారమ్స్ కదనరంగంలోకి దిగడంతో విజయం ఎవరిని వరిస్తుందనే ఉత్సుకత పెరుగుతోంది. సోమవారం నాటి పోటీల్లో పలు జట్లు గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. కాగా, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులు, ప్రతినిధులకు నిర్వాహకులు ప్రతి పూటా పసందైన విందు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. సింహపురి ఆతిథ్యానికి వారంతా ఫిదా అవుతున్నారు.

6

రైల్వే శాఖ వారి
'ప్రీమియం' బాదుడు

- టికెట్ ధరపై 3 నుంచి 5 రెట్ల వసూలు
- డిమాండ్ ఉన్న రూట్లలో మరింత దోపిడీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, ఉత్సవాలు, తిరునాళ్ల ఇలా ముఖ్య రోజుల్లో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో చార్జీలు పెంచడం ఇప్పటిదాకా మనం చూశాం. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని రెండింతల చార్జీలను పెంచి ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. దీని నుంచి గట్టెక్కేందుకు అత్యధిక శాతం మంది రైళ్లను ఎంచుకుంటారు. తామేం తక్కువ తిన్నామా!? అన్నధోరణిలో రైల్వే శాఖ కూడా చార్జీలను పెంచేసింది. ప్రీమియం తత్కాల్ పేరుతో గట్టిగా బాదేస్తోంది. సాధారణంగా చార్జీలు తక్కువగా ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా రైలు ప్రయాణాన్నే కోరుకుంటారు. రైల్వే శాఖ కూడా గూడ్స్ రైళ్లను ఆదాయ వనరుగా చేసుకొని ప్రయాణికుల రైళ్లలో ధరలను అదుపులో ఉంచేది. అయితే కొంతకాలంగా రైల్వేశాఖ తీరులో మార్పువచ్చింది. పేదల కోసం ఎప్పటి నుంచో నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను 'కరోనా' పేరుతో పూర్తిగా రద్దు చేసింది. ఇటీవల పునరుద్ధరిస్తామని అధికారులు ప్రకటించినా అమలు కాలేదు. మెమో రైళ్లలోనూ ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇలా పేద, మధ్యతరగతి ప్రజలకు నష్టం కలిగించేలా రైల్వేశాఖ నిర్ణయాలు మారుతూ వస్తున్నాయి. ఇక రిజర్వేషన్ చేసుకొనే వారి నడ్డి విరిచేందుకు రైల్వేశాఖ తత్కాల్, ప్రీమియమ్ తత్కాల్ పేరుతో టికెట్ రేట్లను అమాంతం పెంచేస్తోంది. ఇదేమిటని రైల్వేశాఖ అధికారులను అడిగితే డిమాండ్ ఉన్నప్పుడు పెంచుకోవచ్చు కదా అని వారి నుంచి సమాధానం వస్తోంది.



భారీగా వసూలు

డిమాండ్ ఉన్న రోజులు, రూట్‌లలో బస్సు చార్జీలు పెరుగుతున్నట్లు రైల్వే శాఖ కూడా టికెట్ ధరలను పెంచేస్తోంది. స్లీపర్‌తోపాటు ప్రీమియమ్ తత్కాల్ పేరుతో 3టైర్ ఏసీ, 2 టైర్ ఏసీ, ఫ్లస్ట్‌క్లాస్ ఏసీ చార్జీలను విమాన చార్జీలతో పోటీపడేలా వసూలు చేస్తోంది. నెల్లూరు నుంచి చిత్తూరు ప్రయాణించాలంటే త్రీటైర్ ఏసీ రూ.505 అయితే ముందుగా బుక్ చేసుకొనేందుకు రైల్వే అధికారిక వెబ్‌సైట్ ఐఆర్‌సీటీసీలో వెయిట్‌యింగ్ లిస్టు చాంతాడంత ఉంటోంది. దాని పక్కనే అదే టికెట్ రూ.1760 ధర 83శాతం కన్ఫర్మ్ అయ్యే చాన్స్ అంటూ దర్శనమిస్తోంది. అదే 2టైర్ ఏసీకి టికెట్ ధర రూ.760 ఉంది. దాని పక్కనే అదే టికెట్ ధర రూ.3300గా ప్రీమియం తత్కాల్‌లో ఉంటుంది. ఇదే విధంగా అన్ని ప్రాంతాల రైళ్లలోనూ చార్జీలు పెంచేశారు.



కొనసాగుతున్న పోలీసు పరీక్షలు

నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సోమ వారం 338 మంది హాజరయ్యారు, 262 మంది గైర్హా జరయ్యారు. జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఈ పరీక్షలను పర్యవేక్షించారు. అభ్యర్థులు ఉద యం ఐదు గంట లకే మైదానానికి చేరుకొని పరీక్షల్లో పాల్గొన్నారు.

-నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

శిథిలమైన గత వైభవం!

కోవూరు పంచాయతీ కొత్తూరులో స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన గ్రామ పరిపాలనాధికారి కార్యాలయం నేడు శిథిలమైంది. పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలని భావించి అప్పట్లో నిర్మించిన ఈ భవనం గ్రామ పరిపాలనకు వెన్నుముకగా నిలచింది. గ్రామ పరిపాలన అనంతరం కాలక్రమంలో గ్రామ మునసబు కార్యాలయంగా, గ్రామచావిడిగా, రీడింగ్‌రూమ్‌గా ఎంతో సేవలందించిన ఈ భవనంపై స్థానికులకు మక్కువ ఎక్కువ. దీంతో భవనానికి పలు పర్యాయాలు సొంత నిధులతో మరమ్మతులు చేపట్టి గత కాలపు చిహ్నంగా కాపాడారు. భవనాన్ని సుందరంగా కన్పించే విధంగా రంగులు వేసి ఆనందపడేవారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించకుండా చారిత్రక కట్టడంగా అపురూపంగా చూసుకునేవారు. ప్రతి నిత్యం అక్కడచేరి కబుర్లు చెప్పుకునేవారు. స్థానికులు ఎంతో అమితంగా ప్రేమించే ఈ కట్టడం మూడేళ్ల కిందటి భారీ వర్షాలకు, వరదలకు దెబ్బతింది. పెంకులు కిందపడి శిథిలమైంది. అప్పటి ప్రభుత్వం పట్టించకోకపోవడంతో మొండిగోడలతో దర్శనమిస్తోంది.



- కోవూరు,(ఆంధ్రజ్యోతి)



కామాక్షితాయి హుండీ ఆదాయం రూ.33 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో సోమవారం హుండీల్లో నగదును లెక్కించారు. గతేడాది అక్టోబరు 29 నుంచి జనవరి 5వ తేదీ వరకు 68 రోజులకుగాను భక్తులు ప్రధాన హుండీల ద్వారా సమర్పించుకున్న కానుకల ద్వారా ఆలయానికి రూ.33,24,667 ఆదాయం చేకూరగా, అన్నదాన సదనం హుండీల ద్వారా రూ.2,30,057 ఆదాయం చేకూరిందని ఈవో ఏవీ.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే 67 గ్రాములు బంగారు వస్తువులు, 190 గ్రాముల వెండి వస్తువులు, యూఎస్‌ఏ డాలర్లు 41 ఉన్నట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణచైతన్య, శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠ.. ఉద్వేగం!

- పోటాపోటీగా ఆలిండియా క్యారమ్స్
- క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన క్రీడాకారులు

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



ఎవరికి ఎక్కువ కాయిన్స్ దక్కుతాయో... ఎవరు క్వీన్ (రెడ్ కాయిన్)ను చేజిక్కించుకుంటారో... ఎన్ని బోర్డుల్లో ఎవరు ఆటను ముగిస్తారో... ఇలా ఆలిండియా క్యారమ్స్ పోటీలు ఉత్కంఠగా... ఉద్వేగంగా జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రత్యర్థి వ్యూహాలను గమనిస్తూనే టెక్నిక్‌కు వేగాన్ని మిళితం చేసి ఆటను త్వరగా ముగించేలా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఎన్నో పోటీల్లో ప్రతిభ చాటిన ర్యాంకింగ్ క్రీడాకారులు ప్రతి అవకాశాన్నీ పాయింట్లుగా మలుచుకుంటూ విజయానికి బాటలు వేసుకుంటున్నారు.

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు క్లబ్‌లో 29వ అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ సహకారంతో ఏపీ క్యారమ్ సంఘం, నెల్లూరు క్యారమ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు, భారతీయ సంస్థలకు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారులతోపాటు మొత్తం 350 మంది ఆటగాళ్లు బరిలో నిలిచారు. తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ జిల్లా వాసులకు కనువిందు చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్స్ డబుల్స్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్‌మేయర్(స్విట్జర్లాండ్), ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ రాకీబుల్ హుస్సేన్, అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీడీ నారాయణ, అఖిల భారత క్యారమ్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నారాయణ్, కోశాధికారి ఎస్ మదన్‌రాజ్, రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్‌జలీల్, ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ కార్యదర్శి, పోటీల నిర్వాహక కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ, కార్యదర్శి వీ రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాసులు, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

పురుషుల విభాగంలో విజేతలు

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఎండి ఆరిఫ్-అర్షదుల్లా ఖాన్ జట్టు కేరళకు చెందిన షన్వర్-అజ్మల్‌పై, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్-పంకజ్ పవార్‌లు, ఢిల్లీకి చెందిన సమూద్-జావెద్‌పై, అస్సాంకు చెందిన ప్రికర్‌సింగ్-ముజిబుల్ రెహ్మాన్‌లు సీఏజీకి చెందిన రాజుభైసారే-ముఖేష్‌లపై గెలుపొందారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్ దైవ్-అహ్మద్ ఫరూఖ్‌లు ఏపీకి చెందిన సురేష్‌రెడ్డి-అనంత్‌రెడ్డిలపై, ఆర్‌బీఐకు చెందిన జహీర్‌పాషా-ప్రఖాషన్‌మోర్‌లు పీఎస్‌పీబీకి చెందిన యోగేష్ పర్దేశి-సందీప్ డెరేకర్‌పై, అస్సాంకు చెందిన జుగల్ కిషోర్ దత్తా-ధబజోతిలు కర్ణాటకకు చెందిన వినోద్-దివాకర్‌లపై విజయం సాధించారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం కరీం ఖాన్-అభిజిత్ త్రిపాంకర్‌లు తమిళనాడుకు చెందిన అబ్దుల్‌ఆసిఫ్-శుబేంద్రబాబుపై, పీఎస్‌పీబీకి చెందిన కె.శ్రీనివాస్-గుఫ్రాన్‌లు మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ సోలంకి-ప్రఫుల్‌కిషోర్‌లపై జయకేతనం ఎగురవేసి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు.

మహిళల విభాగంలో విజేతలు

పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమారి-ఇలవజఖీలు ఏఏఐకు చెందిన మంథాషా ఇక్బాల్-నిధిగుప్తాలపై, జైన్ ఇరిగేషన్‌కు చెందిన సమృద్ధి-శ్రుతిలు ఏపీకి చెందిన హారిక-హరిప్రియలపై, మహారాష్ట్రకు చెందిన కేసర్ రాజేష్ నిర్గస్-మధుర్ మహేష్ డెల్వేలు ఎల్‌ఐసీకి చెందిన అపూర్వ-అంజలిపై, తమిళనాడుకు చెందిన శోభిక-ప్రీతి ప్రిన్సెస్‌లు ఆర్‌బీఐకు చెందిన ఊర్మిళషిండే-పూర్ణిమ పరాటేలపై విజయం సాధించారు. పీఎస్‌పీబీలకు చెందిన కజామియా-మిత్రలు డీఏఎస్ఈటీకి చెందిన దేబోజనిభట్-వర్షబోరాలపై, ఏఏఐకు చెందిన షైనీ-బర్కత్‌నిషాలు బీహార్‌కు చెందిన ఖుష్బురాణి-సంధ్యాసిన్హాలపై, పీఎస్‌పీబీకు చెందిన కాజల్‌కుమారి-ఆకాంక్ష కదమ్‌లు, పశ్చిమబెంగాళ్‌కు చెందిన పాపియా బిస్వాల్-కాజల్‌సింగ్‌లపై, సీసీసీఎస్‌టీకి చెందిన నాగజ్యోతి-నీలంఘాట్కేలు ఆర్‌బీఐకు చెందిన కవితసోమంచి-అంబికపై గెలుపొంది క్వార్టర్స్‌కు వెళ్లారు.

జీవితంలో స్థిరపడ్డా..



క్యారమ్ క్రీడతోనే పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డాను. గతంలో ఏపీ నుంచి క్రీడల్లో పాల్గొన్న నాకు నెల్లూరు జిల్లాలోని కావలి హెడ్‌పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇచ్చారు. తండ్రి రాజేంద్ర దేశంలో మూడో ర్యాంక్‌లో ఉండడంతో ఆయన స్ఫూర్తితో నేను కూడా పలు విజయాలు సాధించాను.

- వినీత, ర్యాంకింగ్ క్రీడాకారిణి

ఆహా.. ఏమి రుచి!!

క్రీడాకారులకు పసందైన విందు

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత ఫెడరేషన్ క్యారమ్ పోటీల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన విందు భోజనాలు అతిథులను, ఆహ్వానితులను, క్రీడాకారులను నోరూరిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు నెల్లూరు ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ ఆహా... ఏమిరుచి! అంటూ లొట్టలేస్తున్నారు. జిల్లా ఘనతను చాటేలా జరుగుతున్న ఈ పోటీల్లో సౌత్, నార్త్ వంటకాలను వడ్డిస్తూ అన్ని రాష్ట్రాల వారి జిహ్వచాపల్యాన్ని తీరుస్తున్నారు. పెళ్లి తరహాలో భోజనం వండి, వడ్డించడం క్రీడా ప్రియులకు మంచి అనుభూతినిస్తోంది. వెజ్ బిర్యానీ, చోలే, ఆలూ పరోట, కచోరీతోపాటు సంప్రదాయ తెలుగు వంటకాలు, స్వీట్లు ఆటగాళ్లతో అదరహో!! అనిపిస్తున్నాయి. కర్ణాటక క్రీడాకారుల కోసం కాలాబాత్, కేరళ వారి కోసం ఇడియాపం, తమిళనాడు వారికి వడకర్రీ, దోశెలు, గుజరాతీలకు మిక్చర్స్ మహారాష్ట్ర వారికి రోటీ, బన్‌బటర్‌జామ్, చపాతీలు, రోటీలు, ఫ్రైడ్ రైస్, కరివేపాకు రైస్, ఎగ్స్, చికెన్, రాయలసీమ రాగిసంగటి, మసాలా వడల పులుసు, చికెన్... ఇలా అన్ని ప్రాంతాల వారి కోసం క్లబ్ నిర్వాహకులు ఎన్నో వెరైటీల వంటకాలను సిద్ధం చేసి ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. క్రీడాకారులు, అతిథులు కూడా ఘుమఘుమలాడే నెల్లూరు రుచులను ఆస్వాదిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో పోటీల్లో పాల్గొంటున్నారు.



క్యారమ్స్‌తో ఉజ్వల భవిత

- జాతీయ, అంతర్జాతీయ క్రీడా ప్రముఖుల మనోగతం

క్యారమ్స్ క్రీడతో యువతకు ఉజ్వల భవిత ఉంటుందని, పట్టుదల, దీక్షతో సాధన చేస్తే విజయాలను అందుకోవచ్చని క్రీడా ప్రముఖులు తెలిపారు. లక్ష్యాలను అధిగమించడమేకాక ఉన్నత శిఖరాలు అధిరోహించడమే ధ్యేయంగా పోటీల్లో పాల్గొని రాణించేందుకు శ్రమిస్తున్నామని క్రీడాకారులు, ప్రతినిధులు తమ మనోగతాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు..

భారత్‌లో విశేష ఆదరణ



భారతదేశంలో క్యారమ్స్ క్రీడకు విశేష ఆదరణ ఉంది. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ క్రీడ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. అధికశాతం మంది క్రీడాకారులు ర్యాంకింగ్ సాధించి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌ను కూడా భారత క్రీడాకారులు సాధిస్తుండడంతో యువత ఈ క్రీడపై ఆసక్తి చూపుతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి ఉన్నతికి పాటుపడుతున్నారు. ఏపీలో మున్ముందు క్యారమ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించనుంది. స్థానిక క్రీడాకారులు అన్ని విభాగాల్లోనూ సత్తా చాటుతున్నారు. ఈ క్రీడాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంతోపాటు క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నాము.

- రకిబుల్ హుస్సేన్, పార్లమెంట్ సభ్యుడు, ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

మహిళలూ సత్తా చాటుతున్నారు



మహిళలు వారి ప్రతిభా పాటవాలను నిరూపించుకునేందుకు క్యారమ్స్ ఒక చక్కని వేదికగా నిలుస్తోంది. వారికి ఫెడరేష న్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుండడంతో సత్తా చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తిని ఇనుమడింప చేస్తున్నారు. ఇప్పటికే నాగజ్యోతి, ఖాజీమా ప్రపంచ చాంపియన్ సాధించి యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అలాగే ఉద్యోగావకాశాలు కూడా అధికంగా ఉండడంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన మహిళలు ఈ క్రీడపై ఆసక్తి చూపుతూ పోటీలు ఎక్కడ జరిగినా హాజరవుతున్నారు. వారికి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మరింత ప్రోత్సహిస్తాము.

- భారతీ నారాయణ్, భారత ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి

ప్రపంచ దేశాల్లో గుర్తింపు



క్యారమ్స్ క్రీడకు ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. భారతలో పుట్టిన ఈక్రీడ నేడు 22 దేశాల్లో విస్తరించి పెద్ద ఎత్తున పోటీలు జరుగుతున్నాయి. ప్రపంచ ఫెడరేషన్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తూనే భారత్‌లో కూడా క్రీడాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాము. గత కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున క్రీడాకారులు ఆసక్తి చూపడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ సాధిస్తుండటం శుభపరిణామం. ప్రపంచ స్థాయిలో కూడా భారత క్రీడాకారులే సత్తా చాటుతూ అన్ని దేశాలకు గట్టి పోటీ ఇస్తున్నారు.

- వీడీ నారాయణ్, అంతర్జాతీయ ఫెడరేషన్ కార్యదర్శి

ప్రపంచ ఛాంపియన్ కావడం గర్వంగా ఉంది



క్యారమ్ క్రీడలో ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉంది. చిన్నతనం నుంచి ఈ క్రీడపై ఉన్న మక్కువతో సాధన చేశాను. తండ్రి మహబూబ్ బాషా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూనే తనను ఎంతగానో ప్రోత్సహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, క్రీడా ప్రేమికులు అందించిన సహకారంతో ప్రపంచ విజేతగా నిలిచాను. ప్రస్తుతం డిగ్రీ చదువుతూనే నిత్యం క్రీడలో సాధన చేస్తున్నాను. ఇప్పటి వరకు నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లో గెలుస్తున్నాను. విశ్వ విజేతగా నిలవడంతో తమిళనాడు ప్రభుత్వం కోటి రూపాయల ప్రోత్సాహక బహుమతి అందించింది. ఇదే స్ఫూర్తితో మంచి ఉద్యోగం సాధించి ప్రపంచ క్యారమ్స్‌లో చిరస్థాయి స్థానం కోసం పోరాడుతున్నాను.

- ఖాజీమా, ప్రపంచ క్యారమ్ చాంపియన్

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

అన్నింటిలో గొలగమూడి క్రీడాకారుల విజయం

వెంకటాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. జోన్-3లో ఉన్న 8 గురుకుల బాలికల పాఠశాలల నుంచి 151 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, క్యారమ్స్, చెస్, షటిల్ తదితర క్రీడా పోటీల్లో విజేతలుగా గొలగమూడి గురుకుల బాలికల పాఠశాల క్రీడాకారులు నిలిచారు. అనంతరం విద్యార్థినులు చేసిన ప్రత్యేక విన్యాసాలు, నృత్యాలు ఎంతోగాను అకట్టుకున్నాయి. వెంకటాచలం సీఐ సుబ్బారావు విజేతలకు బహుమతులు, మెమొంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ ప్రసాద్, కృష్ణమూర్తి, సీహెచ్ ప్రసాద్, భాస్కర్, లక్ష్మీసునీత, పరమేశ్వర్‌రావు, ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ సుబ్బారావు, జిల్లా కన్వీనర్ రమణ ప్రసాద్

పదవులు కాదు... ప్రజాసేవే ముఖ్యం

- నా హయాంలో జిల్లాలో అభివృద్ధి పనులు
- మాజీ సీఎం నల్లారి

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, ప్రజాసేవే ముఖ్యమని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరుకు వచ్చిన ఆయనకు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గౌరవ వందనం అందించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కిరణ్‌ను కలిశారు. గోదావరి, కృష్ణా జలాల పంపకం, సాగునీటి విషయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో నాయకులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలు కిరణ్‌ను సత్కరించారు. అనంతరం విలేక రులతో ఆయన మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నెల్లూరు జిల్లాలో చేసిన అభివృద్ధి గురించి గుర్తుచేసుకున్నారు. నెల్లూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆత్మకూరులో వంద పడకల ఆసుపత్రి, రెండు రెవెన్యూ డివిజన్లు, రెండు మున్సిపాలిటీల స్థాపన అప్పట్లో చేశామన్నారు. అండర్ డ్రైనేజీ కోసం రూ.100 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణం, 20 వేల ఇళ్లు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు అప్పట్లో చేశామని గుర్తుచేసుకున్నారు. పదవులు పొందడం, కోల్పోవడం అనేది ముందుగానే రాసిపెట్టి ఉంటుందని, జీవితంలో ఏ పదవీ శాశ్వతం కాదని కేవలం మాజీ అనేది మాత్రమే శాశ్వతం అని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కందికట్ల రాజేశ్వరి, భరత్‌కుమార్‌రెడ్డి, వాకాటి ఆంజనేయరెడ్డి, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



నల్లారి కిరణ్‌ను సత్కరిస్తున్న మంత్రి ఆనం

వ్యాసరచన పోటీలు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సోమవారం ఆవాజ్ మండల కమిటీ ఆ ధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమాబేగం జీవిత చరిత్రలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి వి ద్యార్థులకు బహుమతులు అందజేస్తామ న్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్‌రసూల్, కమిటీ సభ్యులు ఫరీద్‌బాషా, అన్వర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన చేజర్ల కార్తీక్ కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులు ఘటనను వివరిస్తూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎమ్మెల్యే వారిని ఓదార్చి ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. అనంతరం తూర్పు గోగులపల్లి టీడీపీ నేత ముంతా రమేష్ తల్లి మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి సం తాపం తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కావలి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక దినసరి కూలీగా జీవనం సాగిస్తున్న ఇనగంటి మాల్యాద్రి పక్షవాతంతో మంచం పడ్డారు. విషయం తెలుసుకున్న బెస్ట్ వా కర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రూ.11వేలు అందజేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సంఘం అధ్యక్షుడు తోట శేషయ్య, వన్‌టౌన్ ఎస్సై జానకిరామిరెడ్డి, మందా వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, బత్తిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-2 ఆనందరావు తెలిపారు. సోమవారం గొట్టిగుండాల జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరి శీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చి రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెనూ పాటించాలన్నారు.

కంపచెట్ల తొలగింపు

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుడవళ్లూరు పంచాయతీలోని సచివాలయ నూతన భవనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. భవనం ముందున్న కంపచెట్లను ప్రొక్లయిన్‌తో తొలగింపజేశారు. సచివాలయ సిబ్బంది పంచాయతీ భవనంలోని ఒక గదిలోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ మాచర్ల ఎంపీడీవో ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచ్ మార్పు

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌ని ఖాతాదారుల సౌకర్యార్థం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోకి మార్చినట్లు సోమవారం రీజనల్ మేనేజరు చీమకుర్తి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ బెజవాడ రవి కుమార్ పాల్గొన్నారు. ఖాతాదారులకు సులభతరంగా సేవలు అందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు లక్ష్మీనారాయణ, సెంట్రల్ జీఎస్టీ మెంబరు, భవన యజమాని వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

అభినందనలు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న సయ్యద్ యాకూబ్ అనే దివ్యాంగ విద్యార్థిని సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు అభినందించారు. గతనెల 19న వెంకటాచలం సీఆర్సీ సెంటర్‌లో జరిగిన పారా ఒలంపిక్స్ గేమ్స్ దివ్యాంగుల జూనియర్ రన్నింగ్ విభాగంలో యాకూబ్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించడంతో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. అనంతరం భవిత కేంద్రం రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహ, శివనందిని, సుభాషచంద్రబోస్ పాల్గొన్నారు.

అర్హత పరిశీలన

ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగవైకల్యం, పక్షవాతంతో మంచానికి పరిమితమై నెలకు రూ. 15000 పింఛను పొందుతున్న లబ్ధిదారుల అర్హతను వైద్యబృందం సోమవారం పరిశీలించింది. అప్పారావుపాళెం, బట్టేపాడు, నల్లపురెడ్డిపల్లి, నువ్వూరుపాడు, దేపూరు, బండారుపల్లి, రామస్వామిపల్లి, నాగులపాడు, చెర్లోయడవల్లి, కరటంపాడు, బి.చిరువెళ్ల, నబ్బీనగరం, వాశిలి పంచాయతీలకు సంబంధించిన 23మంది పింఛనుదారుల ఇంటికి స్వయంగా వెళ్లి వారి అర్హతలను వైద్యబృందం పరిశీలించింది. కార్యక్రమంలో డాక్టర్ మునిమురళీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, విస్తరణాధికారి డేవిడ్, కార్యదర్శి ఆనంద్ ఉన్నారు.



పేరుకే ఏరియా వైద్యశాల

- 2 గంటలే వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు
- పలు సేవల్లో సిబ్బంది చేతివాటం
- కొత్తభవనం నిర్మించినా మౌలిక వసతుల కరువు



కావలిలోని ఏరియా వైద్యశాల అత్యవసర విభాగం భవనం

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):డివిజన్ కేంద్రంలోని ఏరియా వైద్యశాలలో వైద్యసేవలు సక్రమంగా అందటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు, సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కొందరు డాక్టర్లు విధులకు తరచూ డుమ్మా కొడుతుండగా మరికొందరు ఉదయం 10గంటలకు విధులకు వచ్చి మధ్యాహ్నం 12గంటలకే ఇళ్లకు వెళుతున్నారు. రోజుకే రెండు గంటలే వారు విధులు నిర్వర్తిస్తున్నారనే స్థానికులు చెబుతున్నారు.

● ఆరోగ్యశ్రీ నిధుల్లో చేతివాటం

ఆరోగ్యశ్రీ ద్వారా చేసిన ఆపరేషన్లకు వచ్చిన ప్రభుత్వ నిధులు కొందరు డాక్టర్లు మాత్రమే వాటిని మింగేస్తున్నారనే విమర్శలున్నాయి. నిధుల పంపిణీలో డాక్టర్ల మధ్య వచ్చిన విభేదాలతో ఈ విషయం బయటకు వచ్చిందని చెబుతున్నారు. రోగులకు అందించే ఆహారం కూడా సక్రమంగా ఇవ్వలేదని చెబుతు న్నారు. సదరన్ సర్టిఫికె ట్ల మంజూరులో కూడా ముగ్గురు డాక్టర్ల టీం పైనల్ చేసేటప్పుడు పైసలిచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తూ దళారీవ్య వస్థ నడుస్తోందనే చర్చించుకుంటున్నారు. వైద్యశాలలో అన్నిపరీక్షలకు ల్యాబ్‌న్నా సక్రమంగా వినియోగించక బయట ల్యాబ్‌ల వద్ద పర్సెంటేజీలు తీసుకుంటున్నారు.

● ఎమ్మెల్యే సీరియస్ వార్నింగ్

వైద్యశాల దుస్థితినిస్థానిక నాయకులు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని యామకాల్లో వైసీపీ నాయకుల పెత్తనం జరుగుతోందని అందువల్లే వారు సక్రమంగా విధులు నిర్వహించటం లేదని లిఖితపూర్వకంగా ఎమ్మెల్యే వివరాలు ఇచ్చారు. ఈ విషయంపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, వైద్యులతో స మావేశమై పద్ధతులు మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు.

● మౌలిక వసతులు కరువు

ఏరియా వైద్యశాల భవనంలో అన్ని వసతులు సమకూర్చక ముందే దాన్ని ప్రారంభించారు. దీంతో మంచినీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కరువయ్యాయి. వైద్యశాల ఆవరణలో కొత్తరోడ్డును నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్ దాని జోలికి వెళ్లడం లేదు. పాత భవనాలు తొలగించినపుడు ప్రహరీని తొలగించారు. ఇప్పటివరకు దాని నిర్మాణం చేపట్టక పోవడంతో పందులు, పశువులు, కుక్కలు ఆసుపత్రి ఆవరణలో తిరుగుతున్నాయి.

త్వరలో రాత్రిబడుల నిర్వహణ

● నాగేశ్వరప్రసాద్, మర్రిపాడు ఎంపీడీవో



ఇంటర్వ్యూ...

మర్రిపాడు,జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో ఉల్లాస్ కార్యక్రమం పేరుతో ప్రభుత్వం త్వరలో రాత్రి బడులు నిర్వహించ నుందని ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ సోమవారం తెలిపారు.

? మండలంలో నిరక్షరాస్యులను గుర్తించారా.

! ఇప్పటికే అన్ని గ్రామాల్లో 75శాతం సర్వే పనులు నిర్వహించాము.

? నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఏదైనా ప్రయత్నం చేస్తున్నారా.

! జాతీయ ఉపాధి హామీ పథకంలో 100రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల పిల్లలకు కంప్యూటర్, ఎలక్ట్రానిక్ వంటి పనులపై ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అట్టివారిని గుర్తిస్తున్నాము.

? ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

! రూ.1.85 కోట్లతో సీసీరోడ్లు, 54 మినీ గోకులాల నిర్మాణం జరుగుతున్నాయి.

స్రైడ్ సంస్థకు పురస్కారం



ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్రైడ్ స్వచ్ఛంద సంస్థకు మదనపల్లికి చెందిన గ్రామజ్యోతి సొసైటీ, ముంబయికి చెందిన మూమెంట్ ఇండియా, కేరళకు రెందిన యూఆర్‌సీ సంస్థలు సంయుక్తంగా సోమవారం పురస్కారం అందజేశారు. స్రైడ్ సంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరికి గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, మూమెంట్ ఇండియా ఆర్గనైజేషన్ డైరెక్టర్ శ్యామ్ జోషి తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందజేసి అభినందించారు.

ఇళ్ల దరఖాస్తు నమోదులో అధికారుల వేధింపులు

- వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు
- దివ్యాంగులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులను సచివాలయ ఉద్యోగులు రకరకాల ప్రశ్నలతో వేధిస్తున్నారని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు తెలిపారు. ఈ విషయంపై ఆయన దివ్యాంగులతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం, తుమ్మలపెంటతో పాటు కావలి పట్టణ ముసునూరు తదితర సచివాలయ ఉద్యోగులు ఇళ్ల మంజూరు దరఖాస్తులు స్వీకరించకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే స్థలం సర్వే నంబరు తెమ్మంటున్నారని దాని కోసం వీఆర్వోలను అడిగితే వారు ఇవ్వటం లేదని వాపోయారు. దివ్యాంగులకు స్థల సర్వే నంబర్లు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సచివాలయంలో దరఖాస్తు ఇస్తే వాటిని పక్కన పడేసి రశీదులు కూడా ఇవ్వటంలేదన్నారు. స్పందించిన ఆర్డీవో సంబంధిత సచివా లయ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. దివ్యాంగులను ఇబ్బంది పెట్టకుండా దరఖాస్తులు తీసుకుని నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే డివిజన్ గృహనిర్మాణశాఖ ఈఈ మాధవరావుతో దివ్యాంగులకు నిబంధనల మేరకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు.


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఐవోసీ పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలం అప్పగింత

● నిర్మాణానికి మార్కింగ్ చర్యలు ● మూసుకు పోతున్న కార్యాలయాలు ● ఆందోళనలో ప్రజలు

కావలి, జనవరి6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) పెట్రోలు బంకు నిర్మాణం పనులు నిర్వాహకులు చర్యలు తీసుకోవడంతో కార్యాలయ ఆవరణం మొత్తం కుదించుపోయ్యిందని అధికారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే తహసీల్దార్ కార్యాలయంతో పాటు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, మండల వ్యవసాయాధికారి కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్, కావలి పోలీస్ సర్కిల్ కార్యాలయం, సబ్‌జైలు, ఉప ఖజానా కార్యాలయం, వాతావరణ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయాలకు వచ్చే వాహనాలు పార్కింగ్ స్థలం లేకుండా పోతుందని అన్ని కార్యాలయాలు అధికారులు, సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు.. అక్కడ పెట్రోల్ బంకు వద్దని వ్యతిరే కిస్తున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ పెట్రోల్ బంకు కోసం 20సెంట్లు స్థలంను అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. స్థలాన్ని సర్వేచేసి ఐవోసీకి అప్పగించటంతో వారు దాని చుట్టూ పరదాలు కట్టి నిర్మాణానికి మార్కింగ్ వేశారు.


పెట్రోల్ బంకు కోసం ఇచ్చిన స్థలంలో చుట్టూ కట్టిన పరదాలు

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే కాకర్ల


షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారామపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. బసినేనిపల్లి పంచాయతీలోని ఎస్ఆర్‌నగర్‌లో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులమును ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. అనం తరం పోలంగారిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలుగుదేశం కార్యకర్త గడ్డం వీరాంజనేయులు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. బసినేనిపల్లిలో పొన్నుబోయిన చెంచల్ బాబు యాదవ్‌తో కలిసి డాబాను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జనసేన భోగినేని కాశీరత్తయ్య, సర్పంచ్‌లు, ఆదినారాయణ, వెంకటసుబ్బయ్య, మాజీ జడ్పీటీసీ జ్యోతి, చంద్రరెడ్డి పాల్గొన్నారు.

● క్రీడల అభివృద్ధికి 10శాతం ఎమ్మెల్యే నిధులు

వింజమూరు: ఎమ్మెల్యే నిధుల నుంచి 10 శాతం క్రీడల అభివృద్ధికి ఉపయోగిస్తానని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న వీఎంసీపీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా వచ్చే ఏడాది నుంచి ఎమ్మెల్యే నిధుల నుండి 10 శాతం క్రీడల అభివృద్ధికి ఉపయోగిస్తానని తెలిపారు. వీఎంసీపీ టోర్నమెంట్ ఆర్గనైజర్‌లను అభినందించారు. కాగా, ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకుడు గణపం సుదర్శన్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, వింజమూరు ఎస్ఐ వీరప్రతాప్, వీఎంసీపీ టోర్నమెంట్ ఆర్గనైజర్ సంధాని, దాతలు పల్లాల ప్రసాద్, ఈస్ట్ వర్డ్ కరస్పాండెంట్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు రహదారుల మరమ్మతులు పూర్తి

● రోడ్లు, భవనాల శాఖ ఈఈ మురళీకృష్ణ



పొదలకూరు-సోమశిల రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

కలువాయి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు డివిజన్ పరిధిలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు ఈనెలాఖరు నాటికి పూర్తిచేస్తామని రోడ్లు, భవనాల శాఖ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. కలువాయి మండలంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు, నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్, వెంకటగిరి నియోజక వర్గాల పరిధిలోని 18 మండలాల్లో దెబ్బతిన్న 48 రహదారుల మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. కలువాయి మండలం రాజుపాళెం పరమానంద ఆశ్రమం సమీపంలో పొదలకూరు- సోమశిల రోడ్డుకు పడిన గండి వద్ద వంతెన నిర్మాణం కోసం రూ.70లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట ఆత్మకూరు ఇన్‌చార్జి డీఈ అమానుల్లా ఖాన్, ఏఈ అన్వేష్ ఉన్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతోనే ఆయకట్టుదారులకు అవస్థలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి జలాశయాలను విస్మరించడంతో ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాయం ఆవరణలో చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన 17 డిస్ట్రిబ్యూటరీల సాగునీటి సంఘాధ్యక్షులు, ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గండిపాళెం జలాశయానికి నిధులు మంజూరు చేయకపోవడంతో కుడి, ఎడమ కాలువలు పూర్తిగా పూడిపోయి సక్రమంగా సాగునీరు అందక ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, సమస్యను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల దృష్టికి తీసుకెళ్లి కాలువల్లో పూడిక తీయించి చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 21 అడుగుల మేర నీటిమట్టం ఉండడంతో మెట్ట పంటల సాగుకు ఈ నెల 24న కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు సురేష్, వైస్ చైర్మన్ రమణారెడ్డి, సాగునీటి సంఘాధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చెంచలబాబు

నేటి నుంచి పబ్లిక్ హియరింగ్

కందుకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నూతన టారీఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈ నెల 7, 8, 10 తేదీల్లో స్థానిక డివిజనల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంతో పాటు డివిజన్ పరిధిలోని పొన్నలూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాల విద్యుత్ వినియోగదారులు ఈనూతన టారీఫ్‌లపై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చేయూత నివ్వండి

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వివరాలు తెలిపారు.

పొలం హద్దులు చూపాలని వినతి

బిట్రగుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు భూ సమస్యలపై నాలుగు వినతులు వచ్చినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. జేపీ గూడూరులో పొలం కొలతలు వేయాలని ముగ్గురు రైతులు, అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటకు చెంది మహిళ పొలం హద్దులు చూపించాలని కోరినట్లు తహసీల్దారు తెలిపారు. చాలావరకు గ్రామ రెవెన్యూ సభలో సమస్యలకు పరిష్కారం జరుగుతుందన్నారు.

టీఆర్ఆర్‌లో యూత్ గేమ్స్ పోటీలు

కందుకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ యూత్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ పోటీల్లో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు శ్రీ గాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో విభాగంలో శ్రీ గాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థినీలు విజేతలుగా నిలవగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బంగారు పతకం, షీల్డ్ అందజేశారు. అలాగే 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ పోటీల విజేతలను కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ గీతా శ్రీనివాసరావులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రవికుమార్, పీడీ కరుణకుమార్ ఉన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ డీ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు సహాయ సంచాలకులు ఎన్ చంద్రశేఖర్, పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు సుధీర్ తెలిపారు. సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం, వాశిలిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీ

ఉదయగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వచ్చేనెల 1, 2, 3వ తేదీల్లో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో సీపీఎం నాయకులు ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, నాయబ్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

అనంతసాగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాతదేవరాయపల్లి, అనంతసాగరం ఉర్దూ పాఠశాలలను సోమవారం ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఖాజామొహిద్దీన్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ప్రతిరోజు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

అనంతసాగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త దాడిచేసిన సంఘటన సోమవారం ఆమనిచిరివేళ్లలో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఉంటున్న షేక్ నఫియా, అతని భర్త హమ్మద్‌బాషాకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈనేపథ్యంలో మద్యం సేవించి నఫియాపై కత్తితో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

క్రీడా దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న దాత మస్తాన్‌రెడ్డి, తదితరులు

అల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆలోచనలు మెరుగ్గా ఉండాలని వారిలో వారికి భేదాలు ఉండకూడదని దాత మేడా మస్తాన్‌రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం దాతలు మేడా మస్తాన్‌రెడ్డి సమకూర్చిన రూ.86వేల విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. 234 మందికి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అవధాని కోట రాజశేఖర్, మేడా రామసుబ్బారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, సిద్దా యానాది శెట్టి, దమ్మాల బ్రహ్మానందం, సిద్దా వెంకట రమణయ్య, బిట్రగుంట చైతన్య రెడ్డి, మేడా మాధవ, శ్రీనివాసులు, అభివృద్ధి కమిటీ కన్వీనర్ జి.చెంచయ్య పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి కొలతల సేకరణ


భవనాల నిర్మాణానికి కొలతలు సేకరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో భవనాల నిర్మాణానికి సోమవారం ట్రాన్స్‌కో సివిల్ ఇంజనీరింగ్ అధికారులు కొలతలు సేకరించారు. ఈ సందర్భంగా ఈఈ కె శ్రీనివాసులు మాట్లాడుతూ 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గతంలో ఉన్న ఏడీఈ కార్యాలయ భవనం, ప్రహరీ తొలగించారని, దీంతో నూతనంగా ఏడీఈ, ఏఈ, ఈఆర్‌వో భవనాల నిర్మాణంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు కోటేశ్వరరావు, వై శ్రీనివాసులు, ఏఈలు ఖుద్దూష్ బాషా, ప్రసాద్, పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కందుకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఈనెల 7న పట్టణంలోని వెంగమాంబ కల్యాణమండపంలో ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు మహమ్మద్ జహంగీర్‌సుల్తాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

నాయకుల ఔదార్యం

సంగం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనసూయనగర్‌లో మూడురోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులను సోమవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి పరామర్శించి రూ.10వేలు అందచేశారు. విషయాన్ని మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లి చిన్నారులకు నెలనెలా పింఛన్‌తో పాటు, ప్రభుత్వం సాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, హజరత్ ఉన్నారు.

'మార్పు' సేవలు చిరస్మరణీయం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శేషారెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, ఆర్ రామసుబ్బారెడ్డి, సిహెచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.